

జన కేతనం
విభిన్నం... విశాఖ ఫలితం
మూడు తరాలుగా రాజకీయాల్లో...
ఒకటే వార్డు... రెండు నియోజకవర్గాల్లో ఓట్లు
- 7లో

ముగిసిన నామినేషన్ల పరిశీలన

పార్లమెంట్ స్థానానికి మూడు నామినేషన్ల తిరస్కృతి

అసెంబ్లీకి 15..

- 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు



నర్సీపట్నంలో నామినేషన్ల పరిశీలనకు హాజరైన వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు

అనకాపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి పార్లమెంట్, జిల్లాలోని అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన శుక్రవారం పూర్తయింది. పార్లమెంట్ స్థానానికి మూడు, అసెంబ్లీ స్థానాలకు 15 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి.

పార్లమెంట్ స్థానానికి దాఖలైన నామినేషన్లను శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అభ్యర్థులు, వారి తరపున హాజరైన ప్రతినిధుల ముందు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ప్రక్రియను అనకాపల్లి జిల్లా ఎన్నికల పరిశీలకులు పర్యవేక్షించారు. అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి మొత్తం 25 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా, క్రమపద్ధతిలో వీటిని పరిశీలించిన అధికారులు వివరాలు, పత్రాలు సక్రమంగా ఉన్న నామినేషన్లను ఆమోదించారు. ముగ్గురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వైసీపీ నుంచి ప్రత్యామ్నాయ అభ్యర్థిగా నామినేషన్ వేసిన డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, బీజేపీ తరపున నామినేషన్ వేసిన సీఎం రమేశ్ సతీమణి శ్రీదేవి, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి నామినేషన్ వేసిన గొలగాని రమేశ్‌నాయుడుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్, వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుతో పాటు మరో 20 మంది నామినేషన్లు ఆమోదం పొందాయి.

జిల్లాలోని అసెంబ్లీ స్థానాలకు..

జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారులు నామినేషన్ పత్రాలను పరిశీలించారు. మొత్తం 90 మంది నామినేషన్లు దాఖలు చేయగా, వాటిలో 15 నామినేషన్లను తిరస్కరించారు. 75 నామినేషన్లను ఆమోదించారు. అనకాపల్లి శాసనసభకు 15 నామినేషన్లు దాఖలు కాగా, మూడు తిరస్కరణకు గురయ్యాయి. 12 నామినేషన్లను ఆమోదించారు. నర్సీపట్నం నియోజకవర్గానికి 10 నామినేషన్లు దాఖలు కాగా, రెండు తిరస్కరించి 8 నామినేషన్లను ఆమోదించారు. చోడవరం నియోజకవర్గానికి 15 నామినేషన్‌లు దాఖలు కాగా, రెండు తిరస్కరణకు గురయ్యాయి. 13 నామినేషన్లను ఆమోదించారు. మాడుగుల నియోజకవర్గం నుంచి 14 మంది నామినేషన్‌లు దాఖలు చేయగా పరిశీలన అనంతరం మూడు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 11 నామినేషన్లను ఆమోదించారు. ఎలమంచిలి నియోజకవర్గానికి 18 నామినేషన్‌లు దాఖలు కాగా, నాలుగు తిరస్కరణకు గురయ్యాయి. 14 నామినేషన్లను ఆమోదించారు. పాయకరావుపేట(ఎస్సీ) నియోజకవర్గానికి 18 నామినేషన్‌లు దాఖలు కాగా, ఒకటి తిరస్కరించారు. 17 నామినేషన్లను ఆమోదించారు.

29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు

ఈ నెల 29వ తేదీ వరకు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ వేసిన అభ్యర్థులు ఎవరైనా తమ నామినేషన్ ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉందని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పేర్కొన్నారు. శని, ఆది వారాలు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాలు కావడంతో నామినేషన్ల ఉపసంహరణ ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోగా చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ప్రాణాలు తీస్తున్న చీప్ లిక్కర్



వైసీపీ పాలనలో నాసిరకం మద్యం ప్రవాహం

- అధికార పార్టీ నేతల చేతుల్లో గల డిస్టిలరీల్లో తయారీ
- బ్రాండెడ్ మద్యం స్థానంలో సొంతబ్రాండ్లు విక్రయం
- గత్యంతరం లేని పరిస్థితుల్లో తాగేస్తున్న మందుబాబులు



కేజీహెచ్‌లోని డీ అడిక్షన్ సెంటర్

- కాలేయం, జీర్ణాశయం, దృష్టి సమస్యలు
- కేజీహెచ్‌కు ప్రతిరోజూ 30 వరకూ ఓపీ నమోదు
- తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న వారిని ఇన్‌పేషెంట్‌లుగా చేర్చుకుని చికిత్స

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తాను అధికారంలోకి వస్తే దశల వారీగా మద్య నిషేధం అమలు చేస్తానని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. దశలవారీగా మద్యాన్ని తగ్గించి పేదలకు అందుబాటులో లేకుండా కేవలం స్టార్ హోటళ్లకే విక్రయాలను పరిమితం చేస్తామన్నారు. మద్య నిషేధం చేసిన తరువాతే మళ్లీ ఓట్లు అడిగేందుకు వస్తానన్నారు. ఆయన ఇచ్చిన హామీ నిలబెట్టుకోకపోగా మరింత నాసిరకం మద్యాన్ని తీసుకువచ్చారు. ఏమాత్రం నాణ్యత లేని ఆ చీప్ లిక్కర్ మందుబాబుల ప్రాణాలను హరిస్తోంది. ప్రభుత్వ దుకాణాల్లో విక్రయిస్తున్న నాసిరకం మద్యం తాగుతున్నవారి కాలేయం, జీర్ణాశయం దెబ్బతింటున్నాయి. ఇంకా కంటిచూపు సమస్యలు కనిపిస్తున్నాయి. ఒకేసారి శరీర అవయవాలు పనిచేయకపోవడంతో ఆస్పత్రిలో చేరాల్సి వస్తోంది. కొంతమంది అప్పటికి ప్రాణాపాయం నుంచి బయటపడినా, చాలామంది మృత్యువు నుంచి తప్పించుకోలేకపోతున్నారు. మద్యం తాగడం వల్ల అనారోగ్యం పాలైన కేసులు కేజీహెచ్‌కు నిత్యం 30 వరకూ వస్తున్నాయి.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా మద్యం పాలసీని ప్రకటించింది. మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహిస్తోంది. మద్యం తయారు చేసే డిస్టిలరీలు కూడా వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లాయి. అధిక లాభాల కోసం నాణ్యత లేని మద్యం తయారుచేసి ఏదో ఒక బ్రాండ్‌తో మార్కెట్‌లోకి వదులుతున్నాయి. ప్రీమియం బ్రాండ్లు అయిన బ్లాక్‌డాగ్, 100 పైపర్స్, టీచర్స్, బ్లెండర్‌స్ప్రైడ్, సిగ్నేచర్ వంటి బ్రాండ్ల సరఫరాను నియంత్రించి, తమ సొంతబ్రాండ్‌లు మద్యం విక్రయాలు పెరిగేలా అబ్కారీ శాఖ అధికారులకు ఆదేశాలివ్వడం మొదలెట్టారు. మద్యం దుకాణాల్లో నాసిరకం మద్యం మాత్రమే అందుబాటులో ఉండడంతో మందుబాబులు తప్పనిసరి పరిస్థితుల్లో దానినే తాగుతున్నారు. దీనివల్ల మద్యం తాగినవారి ఆరోగ్యం కొద్దికాలానికే దెబ్బతింటోంది. నాణ్యత లేని ముడిసరకులు, విపరీతమైన ఫ్లేవర్స్ రంగులు వినియోగించడం, కిక్ పెరగడానికి సింథటిక్ కెమికల్‌ను మోతాదుకు మించి వాడడం వల్ల నాసిరకం మద్యం సేవించిన వారిలో ముందుగా కాలేయం పనితీరు దెబ్బతింటోంది. అలాగే జీర్ణాశయం దెబ్బతిని ఆకలి మందగిస్తోంది. దీనివల్ల పోషకాహారలోపం ... మిగతా 6వ పేజీలో

ధర కూడా గతం కంటే రెట్టింపు

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిల్ రూ.60 నుంచి రూ.70 మధ్య విక్రయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తమ సొంత మనుషుల డిస్టిలరీల్లో తయారైన బ్రాండ్లను విక్రయిస్తున్నారు. మొదట్లో క్వార్టర్ బాటిల్ రెట్టింపు (రూ.120 నుంచి రూ.140) ధరకు అమ్మారు. దశలవారీగా రూ.200 చేశారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్నాయని ఆరేడు నెలలుగా తగ్గించుకుంటూ వచ్చి ప్రస్తుతం రూ.130కి విక్రయిస్తున్నారు.

29న చోడవరంలో సీఎం జగన్ సభ



చోడవరం, ఏప్రిల్ 26: పట్టణంలో ఈ నెల 29న సీఎం జగన్ సభ జరగనున్నది. వాస్తవానికి ఈ నెల 20న పట్టణంలో సీఎం సిద్ధం సభ జరగాల్సి ఉంది. అయితే కొన్ని కారణాల వల్ల సభ రద్దయింది. ఈ నేపథ్యంలో ఈ నెల 29న ఉదయం సీఎం జగన్ బహిరంగ సభ నిర్వహణకు వైసీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం బహిరంగ సభ విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ విజ్ఞప్తి చేశారు.

నేడు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాక



అనకాపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం జిల్లాకు రానున్నారు. కాకినాడ జిల్లా తునిలో పర్యటన ముగించుకొని ఆమె రోడ్డు మార్గంలో ఉదయం 9.30 గంటలకు జిల్లాలో పాయకరావుపేట చేరుకుంటారు. స్థానిక సూర్యామహల్ జంక్షన్‌లో జరిగే ఎన్నికల ప్రచార సభలో షర్మిల ప్రసంగించనున్నట్టు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాసరావు తెలిపారు.

పెద్దాస్పత్రి అభివృద్ధి ఊసేది?

- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైసీపీ ప్రజాప్రతినిధులు
- సిటీ స్కాన్ ల్యాబ్‌ను ప్రారంభించినా సిబ్బంది లేక అందుబాటులోకి రాని సేవలు
- వేధిస్తున్న వైద్య నిపుణుల కొరత, నిధుల లేమి
- ఇప్పటికీ అత్యవసర కేసులను విశాఖ కేజీహెచ్‌కి రిఫర్ చేయాల్సిన దుస్థితి

గత ఎన్నికల సమయంలో ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సూపర్ స్పెషాలిటీగా తీర్చిదిద్దుతామని హామీలు



ఆస్పత్రి వార్డులో రోగులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

'అధికారంలోకి రాగానే అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతాం. నిరుపేదలు రోగులు అత్యవసర వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కి పరుగులు పెట్టాల్సిన పని లేకుండా ఇక్కడే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తెస్తాం'.. ఇవీ గత ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు ఇచ్చిన హామీలు. అయితే వైసీపీ అధికారం చేపట్టి ఐదేళ్లు కావస్తున్నా పూర్తి స్థాయిలో హామీలను నెరవేర్చలేకపోయింది. ఇక్కడ వైద్యుల కొరత, నిధుల లేమి కారణంగా అత్యవసర కేసులను ఇప్పటికీ కేజీహెచ్‌కి రిఫర్ చేయాల్సిన దుస్థితి నెలకొంది.



అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం

అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి ఎలమంచిలి, పాయకరావుపేట, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల నుంచి నిరుపేద రోగులు వైద్యం కోసం వస్తుంటారు. ప్రతీ రోజు 800 నుంచి వెయ్యి వరకు అవుట్ పేషెంట్లు చికిత్సల కోసం వస్తుంటారు. గత ఎన్నికల సమయంలో ఎన్టీఆర్ వైద్యాలయాన్ని అభివృద్ధి చేస్తామని, వైద్య నిపుణులను నియమిస్తామని ప్రస్తుత ఎంపీ భీశెట్టి సత్యవతి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేకపోయారు.



అందుబాటులోకి రాని సిటీస్కాన్ విభాగం

వైద్య నిపుణుల కొరత

ఎన్టీఆర్ వైద్యాలయంలో 42 మంది వైద్య నిపుణులు ఉండాల్సి ఉండగా, ఇప్పటికీ జనరల్ సివిల్ సర్జన్ స్పెషలిస్టు, ఈఎన్‌టీ, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, మానసిక వైద్య నిపుణుడు, సివిల్ సర్జన్, ఆర్ఎంఓ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అలాగే ఒక హెడ్‌నర్సు పోస్టు, 14 స్టాఫ్ నర్సు పోస్టులు, ఒక గ్రేడ్ వన్ ఫార్మశీ పోస్టు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు ఆస్పత్రి పరిపాలన విభాగాల్లో సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఒకటి, జూనియర్ అసిస్టెంట్ 4, ఎక్స్‌రే టెక్నీషియన్ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పూర్తికాల సిబ్బంది లేక ఆస్పత్రిలో ... మిగతా 8వ పేజీలో

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

- 25 మందికి గాయాలు

కోటవురట్ల, ఏప్రిల్ 26: మండలంలో కైలాసపట్నం గ్రామంలో తేనెటీగల దాడిలో ఉపాధి హామీ పథకం కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం కైలాసపట్నం గ్రామ సమీపంలో గల కంకర చెరువులో 187 మంది ఉపాధి కూలీలు పూడికతీత పనులు చేస్తున్నారు. సమీపంలోని ఓ చెట్టుకు తేనె పట్టు ఉంది. అయితే కూలీలు పనులు చేస్తుండగా తేనెటీగలు గుంపులుగా దాడి చేశాయి. దీంతో కూలీలు పరుగులు తీశారు. తేనెటీగల దాడిలో 10 మంది తీవ్రంగా, 15 మంది స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు వీరిని కోటవురట్ల వైద్య విధాన పరిషత్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు సకాలంలో వైద్య సేవలు అందించడంతో వారికి ప్రాణాపాయం తప్పింది. బాధితులను ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఉపాధి ఏపీవో గంగునాయుడు పరామర్శించారు.

బెల్లం లావాదేవీలు పున:ప్రారంభం

ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో యథావిధిగా కార్యకలాపాలు



బెల్లం దించుతున్న కొలగార్లు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 26: స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో శుక్రవారం బెల్లం లావాదేవీలు పునఃప్రారంభమయ్యాయి. కొలగారం, బెల్లం దిమ్మల అపహరణ విషయంలో కొలగార్లకు, వర్తకులకు మధ్య విభేదాలు తలెత్తిన కారణంగా ఈ నెల 18వ తేదీ నుంచి యార్డులో బెల్లం లావాదేవీలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు గురువారం సాయంత్రం వర్తకులు, కొలగార్లతో సమావేశమై చర్చించారని, కొలగారం రెండు రోజులకోసారి ఇవ్వడానికి అంగీకారం కుదిరిందని మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల తెలిపారు. ఎన్నికల సమయంలో అంతా బిజీగా ఉన్నందున ఎన్నికల తరువాత బెల్లం మార్కెట్‌లో బెల్లం దిమ్మల అపహరణకు సంబంధించిన అంశంపై చర్చించి ఒక నిర్ణయం తీసుకుందామని కొలగార్లు కోరారని, యథావిధిగా కొలగారం ఇవ్వడానికి అంగీకారం కుదిరినందున లావాదేవీలు కొనసాగించాలని అధికారులు సూచించారని చెప్పారు. దీంతో శుక్రవారం యార్డుకు వివిధ ప్రాంతాల నుంచి రైతులు తీసుకువచ్చిన బెల్లాన్ని కొలగార్లు ప్లాట్‌ఫారంపైకి దించి అమ్మకాలు సాగించారు. రైతులు 6,034 బెల్లం దిమ్మలను తీసుకువచ్చారు. ఒకటో రకం రూ.4,390లు, రెండో రకం రూ.4,060లు, మూడో రకం రూ.3,510లు ధరలు పలికాయి.

ఎన్‌డీఏ కూటమి వినూత్న ప్రచారం

- పట్టణంలో 'చాయ్ వాలా' పేరిట ప్రచారం
- ఆసక్తి కనబర్చిన పట్టణ ప్రజలు



పాయకరావుపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కూటమి పార్టీల నాయకులు

పాయకరావుపేట, ఏప్రిల్ 26: పట్టణంలో కూటమి నాయకులు శుక్రవారం వినూత్న ప్రచారం చేపట్టారు. జనసేన నాయకుడు తోట నగేశ్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు పట్టణంలో టీ స్టాల్స్, హోటల్స్ వద్దకు వెళ్లి 'చాయ్ వాలా' పేరిట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి నిర్వహించిన కార్యక్రమంలో పట్టణంలో టీ స్టాల్స్, హోటల్స్‌కి వచ్చిన వారిని పరిచయం చేసుకుని కమలం, సైకిల్ గుర్తులు చూపుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట నగేశ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కూటమి తరఫున పోటీచేస్తున్న అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌కు కమలం గుర్తు, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనితకు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే అమలు కాబోయే సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు మజ్జూరి నారాయణ రావు, గూటూరు శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు మేధోసంపత్తిని పెంపొందించుకోవాలి

- సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, ఏప్రిల్ 26: విద్యార్థులు మేధో సంపత్తిని పెంపొందించుకోవాలని, తద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. స్థానిక దీపాంజలినగర్‌లోని ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ప్రాంతీయస్థాయి మేధో ప్రయోగిత, పవర్ క్విజ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సీజీఎం మాట్లాడుతూ ఇటువంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రపంచంలో జరుగుతున్న కొత్త విషయాలు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత విద్యార్థులపై ఉందన్నారు. ఈ పోటీలకు దక్షిణ ప్రాంత ప్రధాన కార్యాలయం పరిధిలోని వివిధ ప్రాజెక్టుల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఆరు బృందాలుగా విభజించి నాలుగు కేటగిరిల కింద పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వచ్చే నెలలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కాగా ప్రాంతీయ స్థాయి పోటీల విజేతలకు సీజీఎం నగదు బహుమతిని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీజీ విభాగం సీజీఎం ఆర్‌ఆర్ పరీదా, సింహాద్రి వివిధ విభాగాల జీఎంలు బీటీ పాత్ర, ఎస్‌జె. డేవిడ్, ఎస్. పద్మప్రియ, సేవాహంగడ్డం, టీఆర్ రాజగోపాలన్, దీపికా లేడిస్ క్లబ్ అధ్యక్షురాలు అంజుసిన్హా, ఉద్యోగులు పాల్గొన్నారు.

100 లీటర్ల సారాతో ముగ్గురి అరెస్టు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 26: మండలంలోని పాల్మన్‌పేట, ఈదటం శివారులో శుక్రవారం పోలీసులు విస్తృత దాడులు చేసి వంద లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఆయా గ్రామాల్లో వేర్వేరు చోట్ల సారా తయారీ బట్టీలపై దాడి చేయగా వంద లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కాకినాడ జిల్లా తొండంగి మండలం వేమవరం పంచాయతీ పంపాదిపేటకి చెందిన గంట రమణ, గోసల లోవరాజు, రేలంగి రాంబాబును అరెస్టు చేశామన్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచామన్నారు. వీరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26 మద్యం బాటిళ్లు స్వాధీనం

పరవాడ, ఏప్రిల్ 26: మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన కోరంగి గురుమూర్తిని శుక్రవారం రాత్రి స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 20 క్వార్టర్ మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా పట్టుకున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేశామన్నారు. గొల్లలపాలెం గ్రామానికి చెందిన ఈపు అప్పారావు ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఆరు మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా పట్టుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

విశాఖ నుంచి మరో విదేశీ విమానం

- కౌలాలంపూర్‌కు సర్వీసు ప్రారంభం

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి మలేషియా రాజధాని కౌలాలంపూర్‌కు కొత్త అంతర్జాతీయ విమాన సర్వీసు అందుబాటులోకి వచ్చింది. ఎయిర్ ఆసియా సంస్థ వారానికి మూడు రోజులు దీనిని నడపడానికి ముందుకువచ్చింది. ఇది బుధ, శుక్ర, ఆదివారాల్లో ఉంటుంది. రాత్రి 9.30 గంటలకు విశాఖపట్నం వచ్చి తిరిగి 10 గంటలకు బయలుదేరుతుంది. ఈ విమానం శుక్రవారం రాత్రి రాగా విమానాశ్రయం డైరెక్టర్, ఇతర సిబ్బంది కలిసి వాటర్ కేనన్(నీటితో స్వాగతం) పలికారు. విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ కౌలాలంపూర్ విమానంతో మూడో అంతర్జాతీయ సర్వీసు వచ్చినట్టయిందని చెప్పారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 26: వేసవి ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దువ్వాడ మీదుగా శ్రీకాకుళం రోడ్డు-తిరుపతి, కొచువేలి-బరౌని మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు.

తిరుపతి-శ్రీకాకుళం రోడ్డు-తిరుపతి వయా దువ్వాడ

07440 నంబరు గల రైలు మే 5, 12వ తేదీల్లో (ప్రతి ఆదివారం) రాత్రి 8.05 గంటలకు తిరుపతిలో బయలుదేరి మర్నాడు ఉదయం 8.05 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరిగి మే 6, 13వ తేదీల్లో (ప్రతి సోమవారం) మధ్యాహ్నం 3.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి సాయంత్రం 6.38 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 8.20 గంటలకు తిరుపతి చేరుతుంది.

కొచువేలి-బరౌని-కొచువేలి...

06091 నంబరు గల రైలు మే నాలుగు నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం తెల్లవారుజాము 1.30 గంటలకు కొచువేలిలో బయలుదేరి మర్నాడు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ, సోమవారం మధ్యాహ్నం 1.55 గంటలకు బరౌని చేరుతుంది. తిరిగి మే ఏడు నుంచి జూలై ఏడు వరకు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు బరౌనిలో బయలుదేరి మర్నాడు ఉదయం 4.18 గంటలకు దువ్వాడ, గురువారం ఉదయం 9.55 గంటలకు కొచువేలి చేరుతుంది.

ఐదు రోజులు మంటలే..!

- తూర్పు, దక్షిణ భారతంలో తీవ్ర వడగాలులు
- రాయలసీమ, తెలంగాణలోనూ గాల్పుల తీవ్రత
- వచ్చే నెలలో మరింత వేడిగాలులు...
- 45 డిగ్రీలు దాటి నమోదయ్యే అవకాశం
- వాతావరణ నిపుణుల హెచ్చరిక
- గతేడాది రికార్డు దాటొచ్చని అంచనా

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మునుపెన్నడూ లేనంతగా ఎండ వేడి, తీవ్ర వడగాడ్పులతో దేశంలోని అనేక ప్రాంతాలు ఉడుకుతున్నాయి. రోహిణి కార్తెకు మరో నెల రోజుల సమయం ఉండగానే రోళ్లు బద్ధలయ్యేలా కాస్తున్న ఎండలతో ప్రజలు ఠారెత్తిపోతున్నారు. అయితే ఈ ఏడాది వేసవి తీవ్రంగా ఉంటుందని వాతావరణ నిపుణులు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు ముందే హెచ్చరించారు. కానీ, అంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నెల రోజుల నుంచి నమోదవుతున్న ఉష్ణోగ్రతలు, ఎండలు, గాడ్పుల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని గతేడాదికంటే ప్రస్తుత ఏడాది రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని ఐఎండీ సీనియర్ అధికారి డీఎస్ పాయ్ శుక్రవారం పేర్కొన్నారు. ఇప్పటివరకు 2023 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైందని, అయితే ఈ ఏడాది ఆ రికార్డును అధిగమిస్తుందని అంచనా వేశారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌లో తీవ్రమైన వడగాడ్పులు వీయడంతో కొద్దిరోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 42 నుంచి 44 డిగ్రీలు, అక్కడక్కడా అంతకుమించి నమోదు కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కాగా, రానున్న ఐదు రోజుల్లో దక్షిణాదిలో ఏపీ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, వీటికి ఆనుకుని ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, విదర్భ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలోని అనేక ప్రాంతాల్లో వేడి వాతావరణం కొనసాగడమే కాకుండా వడగాడ్పులు వీస్తాయని ఐఎండీ శుక్రవారం హెచ్చరించింది. ఈ నెల 28 నుంచి 30 వరకు ఈశాన్య భారతంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఒడిశాలో తొమ్మిది జిల్లాలకు వడగాడ్పుల హెచ్చరికలను ఆ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జారీచేసింది. అలాగే 26-28వ తేదీల మధ్య కేరళలో, 27-29 మధ్య కొంకణ్ ప్రాంతంలో, 28-30 మధ్య పశ్చిమ ఉత్తరప్రదేశ్, కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ ప్రకటించింది. శుక్ర, శనివారాల్లో పంజాబ్ హరియాణాల్లో వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది.

ఎన్నికల ప్రచారంపై ప్రభావం

ఇదిలావుండగా ఎల్‌నినో బలహీనపడినా ఇంకా దాని అవశేషాల ప్రభావంతో పసిఫిక్ మహాసముద్రం నుంచి వస్తున్న వేడి గాలులు భారత ఉపఖండంలో మరింత వేడిని పెంచుతున్నాయని సీనియర్ వాతావరణ శాస్త్రవేత్త ఒకరు పేర్కొన్నారు. దీని ప్రభావంతో దేశం మొత్తం నిప్పుల కుంపటిలా మారిందని, వచ్చే నెలలో మరింత వేడిగాలులు వీస్తాయని, పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటతాయని హెచ్చరించారు. ఈ ప్రభావం ఎన్నికల ప్రచారం, పోలింగ్‌పై పడనుందన్నారు.

నంద్యాలలో 45.5 డిగ్రీలు

రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45.5 డిగ్రీలకు చేరాయి. శుక్రవారం నంద్యాల జిల్లా చాగలమర్రిలో 45.5 డిగ్రీలు, కడప జిల్లా ఖాజీపేటలో 45.3, పల్నాడు జిల్లా మాచర్లలో 45.2, కర్నూలు రూరల్‌లో 44.9, అనంతపురం జిల్లా తాడిపత్రిలో 44.6, ప్రకాశం జిల్లా మార్కాపురం, విజయనగరం జిల్లా కొత్తవలసలో 44.2, మన్యం సాలూరులో 43.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే 41 మండలాల్లో తీవ్రంగా, 116 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రత 46 డిగ్రీలకు చేరనుంది. శనివారం.. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 64 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని, రాష్ట్రవ్యాప్తంగా 183 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు పెరిగిన నేపథ్యంలో గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తాతయ్యబాబు, తదితరులు

తుమ్మపాల, ఏప్రిల్ 26: వైసీపీ అరాచక పాలనను అంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అణగదొక్కబడ్డారన్నారు. ధరలు, పన్నులు, చార్జీల బాదుడుతో ఒక్కొక్క కుటుంబంపై రూ. 10 లక్షలు భారం మోపారన్నారు. విషపూరితమైన మద్యాన్ని రాష్ట్రానికి తీసుకువచ్చి 35 లక్షల మంది పేదలను అనారోగ్యం పాలు చేశారన్నారు. అందులో 30వేల మంది ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వైసీపీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. 2014-2019 మధ్య టీడీపీ పాలనలో నిరుద్యోగ రేటు నాలుగు శాతం ఉంటే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో 24శాతానికి పెరిగిపోయిందన్నారు. ఈ దఫా ఎన్నికల్లో జగన్‌రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం వైసీపీ నేర చరిత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పీవీఎస్ఎన్ రాజు, కోట్ని బాలాజీ, గొంప కృష్ణ, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్యా.. గొంతు తడిసింది!

భానుడి భగభగలకు భూగర్భ జాలాలు అడుగంటుతున్నాయి. బావులు, చెరువుల్లో నీరులేక చాలాచోట్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో నీటికోసం ఓ మూగజీవి పడిన ఆరాటం పలువుర్ని ఆశ్చర్యపరిచింది. నాతవరం మండలం మాధవనగరంలో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. గ్రామంలోని వీధి కుళాయికి ట్యాపు లేదు. దీంతో మహిళలు రోజూ తమ అవసరాలకు సరిపడిన నీటిని పట్టుకున్న అనంతరం నీరు వృథాగా పోకుండా ఓ కర్రముక్కను సూదిగా చెక్కి దానికి అడ్డుగా పెడుతుంటారు. శుక్రవారం మధ్యాహ్నం అటుగా వెళుతున్న గోవు ఆ కుళాయిని చూసింది. నోటితో కర్రపుల్లను లాగి ఆ తరువాత నీటిని తాగి అక్కడి నుంచి వెళ్లిపోయింది.

-నాతవరం



మాధనగరంలో కుళాయి నీటిని తాగుతున్న మూగజీవి

ప్రభుత్వ మద్యం షాపుల్లో సిబ్బంది చేతివాటం

- జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ దాడుల్లో బయటపడ్డ బాగోతం
- క్వార్టర్ బాటిల్‌కు రూ.20 అదనంగా విక్రయాలు
- ప్రభుత్వ మద్యం షాపు ఉద్యోగులపై కేసు
- 28 మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్టు
- మద్యంతో పట్టుబడ్డ వ్యక్తి వాంగ్మూలంతో బయటపడ్డ వ్యవహారం



మద్యం బాటిళ్లతో పట్టుబడ్డ వ్యక్తితో స్క్వాడ్ బృందం

ఎస్.రాయవరం, ఏప్రిల్ 26: అదనపు ధర తీసుకొని అధికంగా మద్యం సీసాలను విక్రయిస్తున్న ధర్మవరం అగ్రహారం ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగుల బండారం గురువారం జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ జరిపిన దాడుల్లో బట్టబయలు అయ్యింది. మండలంలోని వమ్మవరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారంతో గురువారం ఆ గ్రామంలో రెండు చోట్ల జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ దాడులు నిర్వహించింది. గ్రామానికి చెందిన శ్రీకాకుళపు కృష్ణ వద్ద 20 మద్యం బాటిళ్లు, నరాలశెట్టి దివాణం వద్ద 8 మద్యం బాటిళ్లను పట్టుకొని ఇరువురిని అరెస్టు చేసినట్టు శుక్రవారం జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వీవీఎల్ఎన్ గంగాధరరావు తెలిపారు. 20 మద్యం బాటిళ్లతో పట్టుబడిన శ్రీకాకుళపు కృష్ణను అన్ని మద్యం బాటిళ్లను ఎక్కడ నుంచి తెచ్చారని ఆరా తీశారు. ధర్మవరం అగ్రహారం ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ శివకుమార్, సేల్స్‌మెన్ వెంకటేష్, నాగేందర్ కుమార్‌లు అమ్మకపు ధర కంటే ఒక్కొక్క బాటిల్‌కు 20 రూపాయలు అదనంగా తీసుకొని ఇరవై మద్యం బాటిళ్లను ఇచ్చారని చెప్పాడు. దీని ఆధారంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు గంగాధరరావు తెలిపారు. పట్టుబడిన మద్యం బాటిళ్లను సీజ్ చేసి, ఇద్దరి నిందితులపై కేసులు నమోదు చేసి, పోలీసులకు అప్పగించినట్టు గంగాధరరావు చెప్పారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ కె.సూర్యకుమారి, జీఎస్టీ ఆఫీసర్ ఎస్‌వీ ప్రసాదరావు, ఎస్ఐ బి.నాగ కార్తీక్, కానిస్టేబుళ్లు ఎం.రమణ, పి.శ్రావన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న చీప్ లిక్కర్

... 5వ పేజీ తరువాయి

తలెత్తి రక్తహీనతకు దారితీస్తోంది. రక్తహీనత దరి చేరగానే కంటి సమస్యలు వచ్చి దృష్టిలోపం తలెత్తుతోంది. వీటన్నింటి కారణంగా మద్యం తాగిన వ్యక్తి చూస్తుండగానే శక్తిని కోల్పోయి పనిచేయలేని స్థితిలో మంచానపడిపోతున్నాడు. నాసిరకం మద్యం కారణంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నా, ప్రాణాలు పోతున్నా వైసీపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు.

కేజీహెచ్‌కు రోజుకు 30 వరకూ కేసులు

నాసిరకం మద్యం సేవించి అనారోగ్యం బారినపడినవారు, మద్యానికి బానిసైనవారు (వారి ఆ సమస్య నుంచి బయటకు తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు తీసుకువస్తున్నారు) ప్రతిరోజూ 30 మంది వరకూ కేజీహెచ్‌కు వస్తున్నారు. మద్యానికి బానిసలుగా మారిన వారిని ఆ అలవాటు నుంచి బయటపడేసేందుకు వీలుగా కేజీహెచ్‌లో ప్రత్యేకంగా డీ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. కేజీహెచ్‌లో ఓపీ తీసుకున్న వారిని వైద్యులు, మానసిక నిపుణుల సమక్షంలో కౌన్సెలింగ్ చేస్తారు. తర్వాత వారికి మందులు ఇచ్చి మద్యం అలవాటు నుంచి క్రమంగా బయటపడేసేందుకు కృషిచేస్తారు. ఓపీకి వచ్చిన వారిలో కాలేయం, జీర్ణాశయం, కిడ్నీలు వంటివి దెబ్బతిన్నట్టు వైద్యులు భావిస్తే వారిని గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో చేర్పించి చికిత్స అందజేస్తారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో ఇన్‌పేషెంట్లుగా నిత్యం 50 మంది వరకూ చికిత్స పొందుతుంటారని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నా, వైద్యులు మాత్రం అలాంటివారు తమ వద్ద ఎవరూ చికిత్స తీసుకోవడం లేదనే బుకాయిస్తుంటారు. మద్యం సేవించడం కారణంగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో రెండు, మూడు రోజులకొకరు ప్రాణాలు కోల్పోతున్నా, వైద్యులు మాత్రం నెలకు ఒకటి, రెండుకు మించి ఉండవని చెబుతున్నారు.

బాధితులకు పురందేశ్వరి పరామర్శ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి గత ఏడాది డిసెంబరులో కేజీహెచ్‌ను సందర్శించి నాసిరకం మద్యం కారణంగా అనారోగ్యం పాలై గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. అప్పటికి 52 మంది వార్డులో చికిత్స పొందుతుండగా వారిలో 39 మంది కేవలం మద్యం కారణంగా అనారోగ్యం పాలయ్యారని ఆరోపించారు. మద్యం పేరుతో వైసీపీ నేతలు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, దీనిపై సీబీఐ విచారణ జరపాలని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రికి లేఖ కూడా రాశారు.

క్రైం... crime news

చెట్టుపై నుంచి జారిపడి కార్మికుడి మృతి

కశింకోట, ఏప్రిల్ 26: కొబ్బరిచెట్టుపై నుంచి జారిపడి కార్మికుడు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి సీఐ వినోద్‌బాబు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెదురుపర్తిలో ఉన్న రమణయ్య బ్రిక్స్ ఇండస్ట్రీలో పని చేస్తున్న కార్మికుడు గిరిధర్‌శాంత (49) కొబ్బరి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు మృతి చెందాడని తెలిపారు. మృతుడు ఒడిశా రాష్ట్రానికి చెందినవాడని, ఈయన కొంతకాలంగా ఇటుక బట్టీలో కార్మికుడుగా పనిచేస్తున్నాడని చెప్పారు. గిరిధర్‌శాంతకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఎద్దులను తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

- 48 ఎద్దులు స్వాధీనం
- వెంకోజీపాలెం గోశాలకు తరలింపు
- ఇద్దరు అరెస్టు.. మరో ఇద్దరు పరారీ



పోలీసులు పట్టుకున్న గోవుల తరలింపు కంటైనర్

కశింకోట, ఏప్రిల్ 26 : అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకున్నామని సీఐ వినోద్‌బాబు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు గురువారం రాత్రి తాళ్లపాలెం కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎద్దులను తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకున్నామన్నారు. అందులో ఉన్న 48 ఎద్దులను వెంకోజీపాలెంలో గోశాలకు తరలించామని తెలిపారు. కాగా ఈ ఎద్దులను విజయనగరం జిల్లా మానాపురం నుంచి గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు తరలిస్తున్నారన్నారు. పశువైద్యాధికారి పర్యవేక్షణలో గోశాలకు తరలించామని చెప్పారు. రవాణాకు కారణమైన తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన శివలింగం మురుగేష్ పిల్లాయ్, మణికందన్ తంగవేల్‌లను అరెస్టు చేశామన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

వివాహిత అనుమానాస్పద మృతిపై కేసు

- భర్తే హతమార్చాడని మృతురాలి సోదరుడు ఫిర్యాదు



మృతురాలు అన్నపూర్ణ

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 26: ఘర్షణ కారణంగా భార్యను భర్త హత్య చేశాడని ఆరోపిస్తూ అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. పొట్టిదొరపాలేనికి చెందిన బోరా అన్నపూర్ణకు అదే గ్రామానికి చెందిన రామాల సత్తిబాబుతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి బాబు, పాప ఉన్నారు. ఐదేళ్లు సజావుగా సాగిన వీరి కాపురంలో కలతలు చోటుచేసుకున్నాయి. భార్యతో భర్త సత్తిబాబు తరుచూ గొడవ పడేవాడు. గురువారం సాయంత్రం భార్య అన్నపూర్ణతో సత్తిబాబు పొలంలో గొడవ పడుతున్నాడని తెలుసుకున్న అన్నపూర్ణ సోదరుడు రమణ పొలాల్లోకి వెళ్లాడు. అక్కడకి వెళ్లేసరికి సోదరి మృతి చెంది ఉండడాన్ని చూశాడు. బావ సత్తిబాబే తన సోదరిని చంపేశాడని రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

బస్సు ఢీ కొని మహిళ మృతి

విశాఖపట్నం, ఏప్రిల్ 26: బస్సు ఢీకొనడంతో ఓ మహిళ దుర్మరణం చెందింది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడ మండలం దేశపాత్రునిపాలెం సమీపం చింతల గొర్లెవానిపాలెంలో తాపీమేస్త్రీగా పనిచేస్తున్న పైలా వెంకటరమణ, భార్య వరలక్ష్మి, ఎంబీబీఎస్ చదువుతున్న కుమార్తె అనూషతో కలిసి నివసిస్తున్నారు. ఈ నెల 24న గ్రామ దేవత పండుగ సందర్భంగా వెంకటరమణ చేతిలో టపాకాయ పేలిపోవడంతో గాయమైంది. దీంతో ఆయన వడ్లపూడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం వరలక్ష్మి, అనూష ఆస్పత్రిలో వెంకటరమణ వద్దే ఉన్నారు. శుక్రవారం ఉదయం వారిద్దరూ పరవాడ వెళ్లేందుకు బస్టాప్‌నకు నడిచి వెళుతుండగా ఫార్మా కంపెనీకి చెందిన బస్సు అతి వేగంతో వచ్చి వరలక్ష్మిని ఢీకొనడంతో ఆమె కింద పడిపోయింది. స్థానికులతో పాటు అనూష కేకలు వేస్తున్నా డ్రైవర్ పట్టించుకోకుండా వరలక్ష్మి తలపై నుంచి బస్సును పోనివ్వడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దువ్వాడ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కళ్లెదుటే తల్లి మృతి చెందడంతో అనూష కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఆమె ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ బొర్రయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కూటమిని గెలిపించాలి

- సమర్థతగల నేత చంద్రబాబు పాలనతోనే న్యాయం
- ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాయన్

విశాఖపట్నం, ఏప్రిల్ 26: రాష్ట్ర వ్యాప్తంగా పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వి.సుబ్బరాయన్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ అధికారంలో వచ్చిన తర్వాత విశ్రాంత ఉద్యోగులకు ఒకటో తేదీన రావాల్సిన పెన్షన్ ప్రతినెలా 20వ తేదీ వరకు చెల్లించడంలేదన్నారు. నాలుగున్నరేళ్లుగా పీఆర్సీ లేకుండా చేశారన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు పెన్షనర్లకు 10 శాతం పెంచి పెన్షన్ ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రం విడిపోయి ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా చంద్రబాబు 40 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చినట్టు గుర్తుచేశారు. జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ కుమారుడిగా భావించామని, అయితే, నాలుగున్నరేళ్లుగా పెన్షనర్లకు అన్యాయం చేశారని మండిపడ్డారు. మెడికల్ బిల్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవని, హెల్త్‌కార్డులను అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పవిత్రమైన వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద డ్యూటీ వేసి అప్రతిష్ఠ పాలుచేశారన్నారు. ఎక్కడ చూసినా రౌడీయిజం పెరిగి, రాష్ట్రం గంజాయికి అడ్డాగా మారిపోయిందన్నారు. పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారని, విశాఖలో రుషికొండను బోడిగుండు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. 72 శాతం పోలవరంను చంద్రబాబు పూర్తిచేస్తే.. తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. 70 శాతం పూర్తి చేసిన అమరావతి రాజధాని భవనాలను శిథిలావస్థకు చేర్చారన్నారు. యువత భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. 32 వేల టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ స్థితిలో రాష్ట్రం బాగుపడాలన్నా, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రావాలన్నా సమర్థత కలిగిన చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని స్పష్టం చేశారు. ఉన్నత చదువులు చదివిన వారితో వలంటీర్లుగా రూ.5 వేల వేతనంతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని విమర్శించారు. వలంటీర్లకు రూ.10 వేలకు పెంచుతామనిచంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రజలు టీడీపీ కూటమిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జనరల్ సెక్రటరీ పెద్దన్న గౌడ్, సెక్రటరీ పీఎస్ఎన్ మూర్తి, కోశాధికారి టి.నాగభూషణం, జాయింట్ సెక్రటరీ కె. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	113.00
లైవ్ ధర	133.00
విత్ స్కిన్	236.00
స్కిన్ లెస్	246.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

విశాఖ పార్లమెంటు నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు....

	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
విశాఖ తూర్పు	1,39,423	1,46,458	20	2,85,901
విశాఖ దక్షిణం	1,04,659	1,08,437	32	2,31,128
విశాఖ ఉత్తరం	1,38,098	1,41,955	21	2,80,074
విశాఖ పశ్చిమం	1,03,379	1,06,360	10	2,09,749
గాజువాక	1,64,462	1,63,479	13	3,27,954
భీమునిపట్నం	1,75,206	1,82,034	17	3,57,257
శృంగవరపుకోట	1,07,188	1,13,117	4	2,20,309
మొత్తం	9,32,415	9,61,840	117	19,12,372



రాష్ట్రం గురించి ఆలోచించాలి



రాష్ట్రాభివృద్ధికి దూరదృష్టితో ఆలోచించే నాయకుడితోనే ప్రజలకు మేలు జరుగుతుంది. తాత్కాలిక ఉపశమనం కల్పించే అంశాలకు విలువ ఇవ్వకూడదు. సమర్థత కలిగిన నేతను ఎన్నుకుంటే ఆశలు నెరవేరుతాయి. అభ్యర్థుల్లో ఇలాంటి వారిని గుర్తించి ఓటు వేయాలి.

- కొవిరి కోదండరావు,
ఉక్కు విశ్రాంత ఉద్యోగి, స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్

దివాలా తీయించే ప్రభుత్వాలు వద్దు



రాష్ట్రాన్ని ఆర్థికంగా పటిష్టం చేసే సామర్థ్యమున్న నేతలను ఎన్నుకోవాలి. అప్పులపాలు చేసి, ఆర్థికంగా దివాలా తీయించిన పార్టీలను ఎన్నుకుంటే దారుణంగా దెబ్బతింటాం. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాల్సి ఉంది. అందుకు సంబంధించిన ప్రణాళికలను మేనిఫెస్టో ప్రకటించే పార్టీల అభ్యర్థులను గెలిపించుకుందాం. ఐదేళ్లకోసారి వచ్చే అవకాశాన్ని ఓటర్లంతా సద్వినియోగం చేసుకోవాలి.

- జి.రవివర్మ,
రోటరీ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు, గాజువాక

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలి



రాష్ట్రంలో అనేక నీటి ప్రాజెక్టులు పెండింగులో ఉన్నాయి. వాటిని పూర్తి చేసి, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించగలిగే అనుభవం ఉన్న ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి. కొత్త ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలు తేవాలి. దీనివల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తుంది. పేదల సంక్షేమానికి మంచి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయాలి.

- గొనప అప్పన్న,
సామాజిక కార్యకర్త, ఎంవీపీకాలనీ

బతుకులు బాగుపడాలి



బతుకులు బాగుచేసే సామర్థ్యమున్న నాయకులను ఎన్నుకోవాలి. నిరుపేదలను చేసే ప్రభుత్వాలతో ముప్పే. ధరల నియంత్రణ, నేరాలను అరికట్టగలిగే ప్రభుత్వాన్ని ఎన్నుకుందాం. ఐదేళ్లకోసారి వేసే ఓటు మన జీవితాల్ని మార్చేలా ఉండాలి. మరింత దిగజారకూడదు. మంచి అభ్యర్థులను, సమర్థ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి.

- విజయభాస్కర్, న్యాయవాది, ఎంవీపీ కాలనీ

అరాచకాలను అడ్డుకోవాలి



శాంతి భద్రతలను కాపాడగల సమర్థత ఉన్న నేతలు అవసరం. అరాచకాలను సృష్టించే వారితో నిత్యం గండమే. శాంతిభద్రతల పరిరక్షణ పట్ల అవగాహన ఉన్న వారితో మేలు. అలాంటి ప్రజా ప్రతినిధులు చట్టసభలకు ఎన్నికైతే ప్రజా ప్రభుత్వం ఏర్పాటవుతుంది. ప్రజల కోసం ఆలోచించే వారిని గెలిపించుకోవాలి. రాష్ట్రంలో ఎప్పుడూ ప్రశాంత వాతావరణం నెలకొనాలి.

- డాక్టర్ పి.రాఘవేంద్రరావు,
ఐఐహెచ్‌పీ విశాఖ అధ్యక్షుడు, రామ్‌నగర్

ఎన్నికల వేడి మొద ▶ మీరూ పంపించండి

లయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుం టున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243



విశాఖ మహా నగరం



గ్రామీణ ఓటర్ల కంటే పట్టణ ఓటర్ల తీర్పు కాస్త భిన్నంగా ఉంటుంది. పార్టీలతో పాటు అభ్యర్థి, ఇతరత్రా అంశాలు కూడా ఫలితాలను నిర్దేశిస్తాయి. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం ఓటర్ల తీర్పును పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. విశాఖ నియోజకవర్గం ఒకప్పుడు కాంగ్రెస్ కోట. అయితే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాత రాజకీయ చిత్రం మారింది. 1957 నుంచి (1951లో ద్విసభ్యత్వ నియోజకవర్గంగా ఉండేది) ఇప్పటివరకూ మొత్తం పదహారుసార్లు ఎన్నికలు జరగగా కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా ఏడుసార్లు గెలుపొందగా, టీడీపీ మూడుసార్లు విజయం సాధించింది. బీజేపీ, వైసీపీ ఒక్కొక్కసారి గెలుపొందాయి.

పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లు

విశాఖ ఉత్తరం, తూర్పు, దక్షిణం, పశ్చిమ, గాజువాక, భీమునిపట్నం, శృంగవరపుకోట

విభిన్నం... విశాఖ ఫలితం

పార్టీతో పాటు అభ్యర్థి, ఇతర అంశాలకూ ప్రాధాన్యం

- ఏ పార్టీకీ దక్కని అప్రతిహత విజయం
- 1957 నుంచి ఇప్పటివరకూ 16సార్లు ఎన్నికలు
- ఏడుసార్లు కాంగ్రెస్, మూడుసార్లు టీడీపీ విజయం
- బీజేపీ, వైసీపీ ఒకొక్కసారి
- ప్రస్తుతం ప్రాంతీయ పార్టీల మధ్యే పోటీ



తెన్నేటి విశ్వనాథం



పి.వి.జి.రాజు



భాట్టం శ్రీరామమూర్తి



ద్రోణంరాజు సత్యనారాయణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో విశాఖపట్నం కీలకమైన ప్రాంతం. ఏపీకి ఆర్థిక రాజధానిగా గుర్తింపుపొందింది. ఇక్కడ నుంచి ఎంపీగా ఎన్నికైనవారికి చెప్పాలంటే ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. గత ఎన్నికల్లో బహుముఖ పోటీ జరిగింది. తెలుగుదేశం, వైసీపీ, బీజేపీ, జనసేన వేర్వేరుగా పోటీ చేశాయి. ఇంకా కాంగ్రెస్ సహా పలు పార్టీల అభ్యర్థులు పోటీలో ఉన్నా టీడీపీ, వైసీపీ, జనసేన మధ్య ముక్కోణ పోటీ జరిగింది. ఇందులో వైసీపీ అభ్యర్థి స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు. ఈసారి తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. కూటమి తరపున ఎం.శ్రీభరత్ పోటీ చేస్తుండగా, వైసీపీ తరపున మంత్రి బొత్స సత్యనారాయణ భార్య ఝాన్సీ బరిలో ఉన్నారు. వీరిద్దరి మధ్య ప్రధాన పోటీ జరగనున్నది.

ఇదీ చరిత్ర

విశాఖ లోక్‌సభ నియోజకవర్గానికి 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి లంకా సుందరం...కాంగ్రెస్ అభ్యర్థి కె.సుబ్బరాజుపై విజయం సాధించారు. 1957 ఎన్నికల్లో విజయనగరం రాజవంశానికి చెందిన పి.వి.జి.రాజు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎం.వి.కృష్ణారావుపై విజయం సాధించారు. 1962లో తొలిసారి ఇక్కడ కాంగ్రెస్ గెలిచింది. ఆ పార్టీ తరపున విజయనగరం రాజవంశానికి చెందిన విజయ్ ఆనంద్ (విజ్జీ) పోటీ చేసి స్వతంత్ర అభ్యర్థి మద్ది సి.రెడ్డిపై గెలిచారు. 1967లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన తెన్నేటి విశ్వనాథం...కాంగ్రెస్ అభ్యర్థి పి.వెంకటరావును ఓడించారు. 1971 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మళ్లీ పి.వి.జి.రాజు పోటీ చేసి, ఇండిపెండెంట్ అభ్యర్థి తెన్నేటి విశ్వనాథాన్ని ఓడించారు. 1977 ఎన్నికల్లో ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా ఓడిపోయినా రాష్ట్రంలో మాత్రం ఘన విజయం సాధించింది. ఆ ఎన్నికల్లో విశాఖ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ద్రోణంరాజు సత్యనారాయణ...కొత్తగా ఏర్పడిన జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన తెన్నేటి విశ్వనాథంపై దాదాపు 43 వేల ఓట్ల తేడాతో గెలిచారు. జనతా పార్టీలో చీలిక ఏర్పడడం, మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం కూలిపోవడంతో 1980లో లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున కొమ్మూరు అప్పలస్వామి పోటీ చేసి, కాంగ్రెస్ (యు) అభ్యర్థి భాట్టం శ్రీరామ్మూర్తిపై లక్షా 35 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు.

టీడీపీ రాకతో మారిన చిత్రం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత విశాఖ నియోజకవర్గంలో వాతావరణం ఒక్కసారిగా మారింది. అప్పటి వరకు విజయాలు అటూ, ఇటూగా ఉంటే టీడీపీ ఆవిర్భావం తర్వాత పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. టీడీపీ ఆవిర్భావం తరువాత 1984లో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున పోటీ చేసిన భాట్టం శ్రీరామ్మూర్తి...కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి అప్పలస్వామిపై లక్షా 41 వేల ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన ఆ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం వీయగా రాష్ట్రంలో మాత్రం తెలుగుదేశం, మిత్రపక్షాలు ఘన విజయం సాధించడం గమనార్హం. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన విజయనగరం రాజవంశీకుల కోడలు ఉమా గజపతిరాజు (పూసపాటి ఆనందగజపతిరాజు భార్య), టీడీపీ అభ్యర్థి ఎం.వి.వి.ఎస్.మూర్తిపై 26 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఎన్నికల అనంతరం కేంద్రంలో ఏర్పడిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడలేకపోయింది. 1991లో మధ్యంతర ఎన్నికలు జరిగాయి. గత అభ్యర్థులే మరోసారి ముఖాముఖి తలపడగా ఈసారి టీడీపీ అభ్యర్థి ఎం.వి.వి.ఎస్.మూర్తి 3,678 ఓట్ల మెజారిటీతో ఉమాగజపతిరాజుపై గెలిచారు. రాజీవ్‌గాంధీ హత్యానంతరం దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు సానుభూతి పవనాలు బలంగా వీచినా ఇక్కడ ఆ పార్టీ అభ్యర్థి ఓడిపోవడం గమనార్హం. 1996 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన టి.సుబ్బిరామిరెడ్డి 6 వేల ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి పి.ఆనందగజపతిరాజుపై గెలిచారు. 1998లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో కూడా మళ్లీ వీరిద్దరే తలపడ్డారు. ఈసారి కూడా సుబ్బిరామిరెడ్డినే విజయం వరించింది. ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన డి.వి.సుబ్బారావుకు లక్షా75 వేల ఓట్లు వచ్చాయి. 1999లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో బీజేపీ, తెలుగుదేశం కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసిన ఎం.వి.వి.ఎస్.మూర్తి దాదాపు 40 వేల ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి టి.సుబ్బిరామిరెడ్డిపై గెలిచారు. ఇక 2004 ఎన్నికల్లో మూర్తి మరోసారి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి చేతిలో లక్ష పైచిలుకు ఓట్లతేడాతో ఓడిపోయారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి, టీడీపీ అభ్యర్థిగా ఎం.వి.వి.ఎస్.మూర్తి, ప్రజారాజ్యం తరపున పల్లా శ్రీనివాసరావు పోటీపడ్డారు. పురందేశ్వరి విజయం సాధించగా, పీఆర్‌పీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ద్వితీయ స్థానం సాధించారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ కలిసి పోటీ చేశారు. జనసేన మద్దతు ప్రకటించింది. ఉమ్మడి అభ్యర్థిగా పోటీలో దిగిన కంభంపాటి హరిబాబు (బీజేపీ) సుమా రు 90 వేల మెజారిటీతో వైసీపీ తరపున బరిలో దిగిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తల్లి విజయలక్ష్మిపై విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన వైసీపీ మధ్య పోటీ జరిగింది. వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు 4,36,906 ఓట్లు, తెలుగుదేశం అభ్యర్థి ఎం.శ్రీభరత్‌కు 4,32,496 ఓట్లు, జనసేన అభ్యర్థి వీవీ లక్ష్మీనారాయణకు 2,88,874 ఓట్లు, బీజేపీ అభ్యర్థినిగా పోటీ చేసిన దగ్గుబాటి పురందేశ్వరికి 33,892 ఓట్లు వచ్చాయి.



ఉమాగజపతిరాజు



ఎంవీవీఎస్ మూర్తి



టి.సుబ్బిరామిరెడ్డి



ఎన్.జనార్దనరెడ్డి



దగ్గుబాటి పురందేశ్వరి

తొలి ఎన్నికల్లో ద్విసభ్యత్వ నియోజకవర్గం... ఇద్దరు ఎంపీలు

పార్లమెంటుకు 1951లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో కొన్ని ద్విసభ్యత్వ నియోజకవర్గాలు ఉండేవి. వాటిలో విశాఖపట్నం ఒకటి. ఒకరు జనరల్, మరొకరు రిజర్వుడ్ అభ్యర్థి ఉండేవారు. ప్రతి ఓటరుకు రెండు ఓట్లు వేసే అవకాశం ఉంటుంది. అత్యధిక ఓట్లు వచ్చిన మొదటి ఇద్దరిని విజేతలుగా ప్రకటిస్తారు. 1951వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో విశాఖ నుంచి నలుగురు పోటీ చేయగా, గాం మల్లుదొర మధ్యలో పోటీ నుంచి వైదొలిగారు. మిగిలిన ముగ్గురిలో లంకా సుదరం (ఇండిపెండెంట్)కు 1,40,718 ఓట్లు, కె.సుబ్బరాజు (కాంగ్రెస్)కు 1,24,102 ఓట్లు, ఇ.సీతయ్యనాయుడు (ఇండిపెండెంట్)కు 74,656 ఓట్లు వచ్చాయి. దీంతో లంకా సుదరం, కె.సుబ్బరాజులను విజేతలుగా ప్రకటించారు. తరువాత ఎన్నికల నాటికి ద్విసభ నియోజకవర్గాలు రద్దయ్యాయి.



కంభంపాటి హరిబాబు



ఎంవీవీ సత్యనారాయణ

1951 నుంచి 2019 ఎన్నికల వరకు విశాఖ నుంచి గెలుపొందిన ఎంపీలు

ఎన్నిక	విజేత	పార్టీ	మెజారిటీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1951	లంకా సుందరం	ఇండిపెండెంట్	----	ఇ.సీతయ్యనాయుడు	కేఎల్‌పీ
	కె.సుబ్బరాజు	కాంగ్రెస్	----	గాం మల్లుదొర	ఇండిపెండెంట్
1957	పీవీజీ రాజు	ఇండిపెండెంట్	61,114	ఎంవీ కృష్ణారావు	కాంగ్రెస్
1962	పి.విజయ్ ఆనంద్ (విజ్జి)	కాంగ్రెస్	91,142	మద్ది పట్టాభిరెడ్డి	ఇండిపెండెంట్
1967	తెన్నేటి విశ్వనాథం	ఇండిపెండెంట్	34,073	పి.వెంకటరావు	కాంగ్రెస్
1971	పీవీజీ రాజు	ఇండిపెండెంట్	67,188	తెన్నేటి విశ్వనాథం	ఇండిపెండెంట్
1977	ద్రోణంరాజు సత్యనారాయణ	కాంగ్రెస్	42,829	తెన్నేటి విశ్వనాథం	జనతా
1980	కొమ్మూరు అప్పలస్వామి	కాంగ్రెస్(ఐ)	34,635	భాట్టం శ్రీరామ్మూర్తి	కాంగ్రెస్(యు)
1984	భాట్టం శ్రీరామ్మూర్తి	తెలుగుదేశం	1,40,431	కొమ్మూరు అప్పలస్వామి	కాంగ్రెస్
1989	పి.ఉమాగజపతిరాజు	కాంగ్రెస్	25,733	ఎంవీవీఎస్ మూర్తి	తెలుగుదేశం
1991	ఎంవీవీఎస్ మూర్తి	తెలుగుదేశం	5,138	పి.ఉమాగజపతిరాజు	కాంగ్రెస్
1996	టి.సుబ్బిరామిరెడ్డి	కాంగ్రెస్	7,279	పి.ఆనందగజపతిరాజు	తెలుగుదేశం
1998	టి.సుబ్బిరామిరెడ్డి	కాంగ్రెస్	61,517	పి.ఆనందగజపతిరాజు	తెలుగుదేశం
1999	ఎంవీవీఎస్ మూర్తి	తెలుగుదేశం	38,919	టి.సుబ్బిరామిరెడ్డి	కాంగ్రెస్
2004	ఎన్.జనార్దన్‌రెడ్డి	కాంగ్రెస్	1,30,571	ఎంవీవీఎస్ మూర్తి	తెలుగుదేశం
2009	డి.పురందేశ్వరి	కాంగ్రెస్	64,974	పల్లా శ్రీనివాసరావు	ప్రజారాజ్యం
2014	కంభంపాటి హరిబాబు	బీజేపీ	90,488	వైఎస్ విజయలక్ష్మి	వైసీపీ
2019	ఎంవీవీ సత్యనారాయణ	వైసీపీ	4,410	ఎం.శ్రీభరత్	తెలుగుదేశం

లోక్‌సభకు మహామహులు

పోరాట యోధుడు తెన్నేటి విశ్వనాథం, విజయనగరం రాజవంశానికి చెందిన పి.వి.జి.రాజు, కాంగ్రెస్ సీనియర్ నేత ద్రోణంరాజు సత్యనారాయణ, స్వాతంత్ర్య సమరయోధుడు భాట్టం శ్రీరామమూర్తి, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి వంటి మహామహులను లోక్‌సభకు పంపిన ఘనత విశాఖపట్నం ఓటర్లకే దక్కుతుంది.

మూడు తరాలుగా రాజకీయాల్లో...



మాజీ ఎమ్మెల్యే బోళెం గోపాత్రుడు (ఫైల్)

- సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే వరకూ పలు పదవులు చేపట్టిన బోళెం గోపాత్రుడు కుటుంబం
- 1978 సంవత్సరంలో నర్సీపట్నం ఎమ్మెల్యేగా గోపాత్రుడు
- 2009లో శాసనసభ సభ్యురాలిగా ఆయన కోడలు ముత్యాలపాప
- ఎంపీపీలుగా గోపాత్రుడు, వెంకటరమణ, అరుణశ్రీ
- వేములపూడి సర్పంచులుగా బోళెం సన్యాసిపాత్రుడు, చెల్లయ్యమ్మ



మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప, వెంకటరమణ



మాజీ ఎంపీపీ బోళెం అరుణశ్రీ

నర్సీపట్నం, ఏప్రిల్ 26: నర్సీపట్నం మండలంలోని వేములపూడికి చెందిన బోళెం గోపాత్రుడు కుటుంబంలో మొదటి తరం నుంచి మూడో తరం వరకూ ఏదో ఒక పదవి చేపట్టి ప్రజా ప్రతినిధులుగా రాణించారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, ఎమ్మెల్యే పదవులతో నేటికీ రాజకీయాలలో ఉనికిని చాటుకుంటున్నారు.

బోళెం గోపాత్రుడు ఎమ్మెల్యేగా, ఎంపీపీగా పనిచేశారు. ఆయన కుమారుడు సన్యాసిపాత్రుడు, కోడలు చెల్లయ్యమ్మ వేములపూడి సర్పంచులుగా చేశారు. వీరి పెద్ద కుమారుడు వెంకటరమణ, చిన్న కుమారుడు రామ్‌ప్రసాద్, ఇద్దరు ఆడ పిల్లలు. పెద్దకుమారుడు వెంకటరమణ రెండు పర్యాయాలు ఎంపీపీగా, ఒకసారి వైస్ ఎంపీపీగా చేశారు. పెద్దకోడలు బోళెం ముత్యాలపాప ఎంపీపీ, ఎమ్మెల్యే పదవులు చేపట్టారు. చిన్న కుమారుడు రామ్‌ప్రసాద్ వేములపూడి ఉప సర్పంచ్‌గా, ఆయన భార్య అరుణశ్రీ నర్సీపట్నం ఎంపీపీగా చేశారు. రామ్‌ప్రసాద్ ప్రస్తుతం వేములపూడి-1 సెగ్మెంట్ నుంచి ఎంపీటీసీ సభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బోళెం గోపాత్రుడు రెండుసార్లు (1972, 1978) నర్సీపట్నం అసెంబ్లీ నియోజక వర్గానికి పోటీ చేసి ఒక పర్యాయం విజయం సాధించారు. 1978లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన గోపాత్రుడు... జనతా పార్టీ అభ్యర్థి రాజాసాగి సూర్యనారాయణరాజు పై విజయం సాధించారు. ఆ తరువాత మండల వ్యవస్థలో ప్రత్యక్ష పద్ధతిలో మొట్టమొదటిసారిగా జరిగిన ఎన్నికలలో బోళెం గోపాత్రుడు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాళ్ళ నూకరాజుపై విజయం సాధించారు. ఆయన 1987 నుంచి 88 వరకు నర్సీపట్నం మండల అధ్యక్షుడుగా పదవిలో ఉన్నారు. ఆయన కాలం చేయడంతో ఎంపీపీ పదవికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఉప ఎన్నికలలో ఆయన మనవడు బోళెం వెంకటరమణ ఎంపీపీగా పోటీ చేసి విజయం సాధించారు. తర్వాత 1995 నుంచి 2000 వరకు ఎంపీపీగా, 2001 నుంచి 2006 వరకూ మండల ఉపాధ్యక్షుడుగా పదవులు చేపట్టారు. ఆ తర్వాత బోళెం వెంకటరమణ భార్య ముత్యాలపాప 2009 శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి సమీప టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడుపై విజయం సాధించారు. అలాగే 2009 నుంచి 2011 వరకు బోళెం వెంకటరమణ సోదరుడు రాంప్రసాద్ భార్య అరుణశ్రీ ఎంపీపీగా ఉన్నారు. 2009 నుంచి 2011 మధ్య కాలంలో బోళెం చెల్లయ్యమ్మ వేములపూడి సర్పంచ్‌గా, ఆమె పెద్ద కోడలు ముత్యాలపాప నర్సీపట్నం ఎమ్మెల్యేగా, చిన్న కోడలు అరుణశ్రీ నర్సీపట్నం ఎంపీపీ పదవిలో ఉండడం విశేషం.

సమ్‌థింగ్ స్పెషల్

ఒకటే వార్డు... రెండు నియోజకవర్గాల్లో ఓట్లు

- జీవీఎంసీ 98వ వార్డు ప్రత్యేకత

ఒకే వార్డు పరిధిలోని ఓటర్లు రెండు నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహించే అభ్యర్థులను ఎన్నుకోనున్నారు. ఈ ఘనత జీవీఎంసీ 98వ వార్డు వాసులకు దక్కింది. ఇక్కడి ఓటర్లలో కొంతమంది భీమిలి శాసనసభ అభ్యర్థి, విశాఖపట్నం లోక్‌సభ అభ్యర్థికి ఓట్లు వేయాల్సి ఉండగా, మరికొంతమంది ఓటర్లు పెందుర్తి శాసనసభ అభ్యర్థికి, అనకాపల్లి లోక్‌సభ అభ్యర్థికి ఓట్లు వేయాల్సి ఉంటుంది. గతంలో జీవీఎంసీ 72వ వార్డుగా ఉండే సింహాచలం, దానికి ఆనుకుని ఉన్న గ్రామాలు పూర్తిగా పెందుర్తి నియోజకవర్గంలో ఉండేవి. అయితే వార్డుల విభజన నేపథ్యంలో ఇది 98వ వార్డుగా రూపాంతరం చెందింది. ఈ నేపథ్యంలో సింహాచలం గోశాల కూడలి నుంచి అడివివరం, లండగరువు, సింహగిరి గిరిజన గ్రామాలన్నీ భీమిలి నియోజకవర్గంలో విలీనమయ్యాయి. సాయినగర్, ప్రహ్లాదపురంలోని మోదీస్ట్రీట్, అప్పన్నపాలెం, సాయిమాధవనగర్ తదితర ప్రాంతాలు పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో 98వ వార్డుకు ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టయింది. తాజా గణాంకాల ప్రకారం భీమునిపట్నం నియోజకవర్గంలో ఉన్న 98వ వార్డులో 16 పోలింగ్ బూత్‌లుండగా, 14,696 మంది భీమిలి ఎమ్మెల్యే, విశాఖ ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేస్తారు. అదే విధంగా ఐదో పోలింగ్ బూత్‌లలో సుమారు 7,290 మంది ఓటర్లు పెందుర్తి ఎమ్మెల్యే, అనకాపల్లి ఎంపీకి తమ ఓట్లు వేయాల్సి ఉంది. దాంతో వివిధ పార్టీలకు చెందిన నేతలు వార్డులోని కొంత భాగంలో భీమిలి శాసనసభ, విశాఖ ఎంపీ అభ్యర్థుల తరఫున, మరికొంతభాగంలో పెందుర్తి శాసనసభ, అనకాపల్లి ఎంపీ అభ్యర్థుల తరఫున రెండు విధాలుగా ప్రచారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

● సింహాచలం

తేజస్విని ప్రచారోత్సాహం

విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ తరపున అతని సతీమణి తేజస్విని విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఆరిలోవలో ఇలా సైకిల్ గుర్తును ఓటర్లకు చూపిస్తూ ఉత్సాహంగా ప్రచారం చేశారు.

- విశాఖపట్నం



అసెంబ్లీకి పంపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

▸ ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్



తురంగలపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, ఏప్రిల్ 26 : నియోజకవర్గ ప్రజలంతా అసెంబ్లీకి పంపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఎలమంచిలి జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం తురంగలపాలెం, షేకిళ్లపాలెం, మెట్టపాలెంల్లో సుందరపు విజయకుమార్, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరు డు సీఎం రాజేష్, కూటమి పార్టీల నేతలతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సుందరపు మాట్లాడుతూ ప్రజలంతా కూటమి అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతున్నారని, రాష్ట్రంలో రానున్నది కూటమి ప్రభుత్వమన్నారు. ఇప్పటికే వైసీపీ పాలనపై ప్రజలకు విరక్తి కలిగిందన్నారు. షేకిళ్లపాలెంలో మహిళలు సుందరపునకు హారతులు పట్టారు. కార్యక్రమంలో కూటమి నేతలు కొలుకులూరి విజయ్‌బాబు, బొద్దపు శ్రీను, ఇత్తంశెట్టి సన్యాసి నాయుడు, ఇత్తం శెట్టి రాజు, రాజాన నారాయణమ్మ, అన్నం బాబ్జీ, బాస్కరావు, నాని, వరహాలరావు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

రాంబిల్లి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇస్తే ఎలమంచిలి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తామని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. శుక్రవారం దిమిలిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎమ్మెల్యే కన్నబాబురాజు గ్రామాల్లోను ఎటువంటి అభివృద్ధి చేయలేదని, ఆయన మాత్రం అన్నివిధాల అభివృద్ధి సాధించారని ఆరోపించారు. ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను ఆయన బానిసల్లా చూడడం దారుణమన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు గాజుగ్లాసు గుర్తుపైన, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు సీఎం రాజేష్, జనసేన పార్టీ ఉత్తరాంధ్ర నాయకుడు సుందరపు సతీష్‌కుమార్, సుందరపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలి

▸ సొంతూరుకు రోడ్లు వేయించుకోలేని ఎమ్మెల్యే

▸ పెందుర్తి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు



మలునాయుడుపాలెంలో ప్రసంగిస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, ఏప్రిల్ 26 : రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నాశనం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తరిమి కొట్టాలని పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలోని మొగలిపురం గ్రామదేవత బండితల్లికి శుక్రవారం పూజలు చేసిన అనంతరం పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మొగలిపురం, మలునాయుడుపాలెం, గుల్లేపల్లి, బోదివలస, ఎల్లుప్పి, అయ్యన్నపాలెం, ఒమ్మివానిపాలెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కూటమి నేతలకు మహిళలు తిలకం దిద్ది హారతులు పట్టారు. మూడు పార్టీల కార్యకర్తలు, ప్రజలు గ్రామాల్లో నేతలకు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కూటమి విజయం చారిత్రక అవసరం అన్నారు. అన్ని రంగాల్లో అదోగతి పాలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టే సత్తా అనుభవజ్ఞుడైన చంద్రబాబుకే ఉందన్నారు. సొంతూరుకు రోడ్లు వేయించుకోలేని ఎమ్మెల్యే లోకల్, నాన్ లోకల్ అంటూ చౌకబారు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పంచగ్రామాల సమస్య పరిష్కరించిన తరువాతే మిమ్మల్ని ఓట్లు అడుగుతానని బీరాలు పలికిన ఎమ్మెల్యే.. ఏ ముఖం పెట్టుకొని ఇప్పుడు ఓట్లు అడుగుతున్నాడని ప్రశ్నించారు. మే 13న జరిగే ఎన్నికల్లో తనకు గాజు గ్లాసు, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ.. వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే గ్రామాల్లో బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. మీరు బెదిరేస్తే బెదిరిపోవడానికి మేము సిద్ధంగా లేమని, ఖబడ్దార్ అని గుల్లిపల్లి సభలో హెచ్చరించారు. కూటమి సభలకు వెళ్లినా, ఓటేసినా సంక్షేమ పథకాలు నిలిపేస్తామని ఇక్కడ నేతలు ప్రజలను భయపెడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. సంక్షేమ పథకాలకు చిరునామా టీడీపీ అన్నారు. ం ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు గొర్లి రామునాయుడు, కర్రి కనకరాజు, భరణికాన బాబూరావు, తమరాన బంగారునాయుడు, గండి దేముడు, బోకం నారాయణమూర్తి, గజ్జి నరసింగరావు, గంతకోరు సూర్యనారాయణ, బంతికోళ్ల పద్మ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

పరవాడ : పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం రాత్రి ఈ.బోనంగి ఫార్మా పునరావాసకాలనీలో ప్రచారం నిర్వహించారు. గాజుగ్లాసు, కమలం పువ్వు గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి బుగిడి రామగోవిందరావు కోరారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాలు గురించి ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి లేదు

పాయకరావుపేట టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత



చినవెదుళ్లపాలెంలో ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న అనిత

నక్కపల్లి, ఏప్రిల్ 26: కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్‌డీఏ కూటమి గెలిస్తేనే ప్రజల కష్టాలు తీరుతాయని పాయకరావుపేట టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం చినవెదుళ్లపాలెంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు ఆమెకు హారతులిచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా క్షీణించిందని, విధ్వంసకర పాలన, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టడమే ధ్యేయంగా వైసీపీ ప్రభుత్వం పాలన సాగించిందన్నారు. పేదలు బతికే పరిస్థితులు ఎక్కడా లేవన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేశారని, మరలా ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చాక ప్రజల కష్టాలు తీరుతాయని చెప్పారు. సాయంత్రం విశాఖలో వేట కోసం వెళ్లిన రాజయ్యపేట, బోయపాడు గ్రామాలకు చెందిన మత్స్యకారులను కలిశారు. మే 13న జరిగే ఎన్నికల్లో తనను, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను గెలిపించాలని కోరారు. ఆమె వెంట టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలో ఇంటింటా ప్రచారం

పాయకరావుపేట: పట్టణంలోని పెదిరెడ్డి సన్యాసిరావునగర్ కాలనీలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఇంటింటి ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ.. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌కు కమలం గుర్తుపైన, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనితకు సైకిల్ గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు చింతకాయల రాంబాబు, పల్లా విలియం కేరి, ఎం.రమాకుమారి, జనసేన నాయకులు ఆచంట దొర, బీఎస్.నారాయణ, శివలంక నాగమల్లి, బీజేపీ నాయకులు కువల కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీరాంపురంలో కూటమి పార్టీలు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో నాయకులు బొంది కాశీవిశ్వనాథం, సీహెచ్.పద్దు, గుడబంటి శాంతమ్మ, పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

▸ అనకాపల్లిలో మూడు..పేటలో ఒకటి..

ఎలమంచిలిలో 4 నామినేషన్లు తిరస్కరణ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 26 : అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి దాఖలైన నామినేషన్లలో మూడింటిని తిరస్కరించినట్టు ఆర్‌వో కార్యాలయ డీటీ జయశ్రీ శుక్రవారం తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గానికి 15 మంది 30 సెట్ల నామినేషన్లను దాఖలు చేయగా.. వాటిని ఆర్‌వో జాహ్నవి పరిశీలించారు. ఈ పరిశీలనలో ఇండిపెండెంట్ అభ్యర్థి కామిరెడ్డి భరత్‌కుమార్ నామినేషన్‌ను వయస్సు 23 ఏళ్లు కావడంతో తిరస్కరించినట్టు ఆమె తెలిపారు. అలాగే వైసీపీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ నామినేషన్ సక్రమంగా ఉండడంతో ఆయన సతీమణి మెహర్‌నివేదిత నామినేషన్‌ను, కాంగ్రెస్ అభ్యర్థి ఐఆర్ గంగాధర్ నామినేషన్ సక్రమంగా ఉండడంతో ఐ.అవినాష్ నామినేషన్ కూడా తిరస్కరించినట్టు తెలిపారు. 12 మంది నామినేషన్లు అనుమతించబడ్డాయి. నియోజకవర్గంలో కొణతాల రామకృష్ణ (జనసేన), మలసాల భరత్ కుమార్ (వైసీపీ), ఐఆర్ గంగాధర్ (కాంగ్రెస్), పొలమరశెట్టి అంబికాదేవి (పిరమిడ్ పార్టీ), నూదికొండ మాణిక్యాలరావు (బీఎస్పీ), ఒమ్మి వెంకటయాదవ్ (సమాజ్‌వాది), ఎస్‌వీవీ రామచంద్రరావు (ప్రేమ జనతాదళ్, స్వతంత్ర), కాసారపు సూర్యనారాయణ (స్వతంత్ర), దొమ్మేసి అప్పారావు (రిపబ్లికన్), తోట వెంకట సాయి ముకుంద (ప్రజా ప్రస్థానం), కనిశెట్టి సురేష్‌బాబు (జైభారత్), ఆళ్ల సత్తిరాజు (స్వతంత్ర) అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు ఆమె తెలిపారు.

పాయకరావుపేటలో 17 నామినేషన్లు..

నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గంలో 18 నామినేషన్లు దాఖలు కాగా అందులో ఒక నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు కుమారుడు కంబాల సందీప్ నామినేషన్‌ను తిరస్కరించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆర్వో కె.గీతాంజలి నేతృత్వంలో నామినేషన్ల పరిశీలన చేశారు.17 నామినేషన్లు ఆమోదం పొందాయని చెప్పారు.

ఎలమంచిలిలో 14 నామినేషన్లు

ఎలమంచిలి: ఎలమంచిలి నియోజకవర్గంలో 4 నామినేషన్‌లు తిరస్కరించినట్టు రిటర్నింగ్ అధికారి మనోరమ తెలిపారు. ఉప్పలపాటి సుకుమారవర్మ(వైసీపీ), ఈశ్వరరావు సుందరపు (భారత జాతీయ కాంగ్రెస్), పెదపూడి రాము (భారత జాతీయ కాంగ్రెస్), దువ్వాడ విజయ్‌కుమార్ (స్వతంత్ర) నామినేషన్లు తిరస్కరించినట్టు చెప్పారు. నియోజకవర్గంలో అనంత రామనరసింగరావు తనకాల(భారత జాతీయ కాంగ్రెస్), ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు(వైసీపీ), లంబా శ్రీనివాసరావు(బీఎస్పీ), బి.అమ్మాజమ్మ(పిరమిడ్ పార్టీ), అర్జున్‌కుమార్ సుందరపు(నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), దాడి పూర్ణచంద్రరావు (జై భారత్‌పార్టీ), బోజా నాగేశ్వరరావు(రిపార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా), సుందరపు విజయ్‌కుమార్(జనసేన), ఎరిపిల్లి కాసులు(స్వతంత్ర), ప్రగడ అన్నపూర్ణ(స్వతంత్ర), బొచ్చా శ్యామల(స్వతంత్ర), 12. మేరుగు రాజుబాబు(స్వతంత్ర), 13. మొల్లేటి రమేష్(స్వతంత్ర), 14. సుందరపు రవికుమార్(స్వతంత్ర)ల నామినేషన్‌లు సక్రమంగా ఉన్నాయని ఆమె తెలిపారు.

మాకు సంక్షేమ పథకాలు అమలు చేయండి

సీఎం రమేశ్‌ను కోరిన రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు



సీఎం రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర రేషన్ డీలర్స్ సంఘం ప్రతినిధులు

కొత్తూరు, ఏప్రిల్ 26 : అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను రాష్ట్ర రేషన్ డీలర్స్ సంఘం ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా బీజేపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీలర్స్ సంఘం అధ్యక్షుడు దివి లీలా మాధవరావు మాట్లాడుతూ అల్పాదాయ కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న తమ కుటుంబాలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోమార్లు డీలర్ల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. మృతి చెందిన డీలర్ల అంత్యక్రియలకు సంక్షేమ నిధి ఏర్పాటు, హెల్త్ కార్డులు జారీ, బీమా సౌకర్యం కల్పించాలని విన్నవించారు. దీనిపై బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ స్పందిస్తూ.. ప్రధాన నరేంద్ర మోదీ, చంద్రబాబునాయుడుల దృష్టికి రేషన్ డీలర్ల సమస్యలను తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం రేషన్ డీలర్ల సమస్యలకు సంబంధించి వినతిపత్రం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి గంగాధర్, గౌడ్ రాష్ట్ర సమాఖ్య సలహాదారు ఫణికుమార్, డీలర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆఫీస్‌లో ప్రజలకు అందని సేవలు

▸ ఎప్పుడు చూసినా తలుపులు మూతే

▸ ఎన్నికల విధుల్లో ఉన్నామంటూ

▸ వీఆర్‌ఏలతో చెప్పిస్తున్న అధికారులు

▸ సర్టిఫికెట్లు కోసం అవస్థలు



గడియ వేసి ఉన్న తహసీల్దార్ కార్యాలయం

అచ్యుతాపురం, ఏప్రిల్ 26: అచ్యుతాపురం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల విధుల పేరు చెప్పి ఈ కార్యాలయంలో ఏ పని చేయడం లేదు. చివరకు సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతీ శుక్రవారం అచ్యుతాపురం సంత జరుగుతుంది. ఈ సంతకు వచ్చిన వారు తమ సమస్యలను చెప్పుకోవడానికి, సర్టిఫికెట్ల కోసం సంత జరిగే ప్రదేశం ముందు ఉన్న తహసీల్దార్ కార్యాలయానికి అధిక సంఖ్యలో అర్జీదారులు వస్తారు. ఇదేవిధంగా శుక్రవారం మండల నలుమూలల నుంచి ప్రజలు వివిధ పనులపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. గంటల తరబడి వేచి ఉన్నా తలుపులకు గడియలు వేసి ఉన్నాయి. వీఆర్‌ఏలు మాత్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉదయం 12 గంటల తర్వాత నుంచి ఉన్నారు. వీరు తప్ప తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులెవరూ అందుబాటులో లేరు. అంతా ఎన్నికల విధుల్లో ఉన్నారు. సాయంత్రం ఐదు తర్వాత రండి అని వీఆర్‌ఏలు చెబుతున్నారు. సాయంత్రం ఐదు గంటలకు వస్తే తాము ఎప్పుడు తిరిగి ఇళ్లకు వెళతామని అర్జీదారులు అంటున్నారు. అత్యవసరంగా సర్టిఫికెట్లు కావలసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు తెలుకుల సంఘం మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

కొత్తూరు, ఏప్రిల్ 26 : అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు జిల్లా అఖిల గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘం ప్రతినిధులు మద్దతు పలికారు. శుక్రవారం గవరపాలెం రైతు భారతి కల్యాణ మండపంలో జిల్లా అఖిల గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘం ప్రతినిధుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజల సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉందన్నారు. గాండ్ల తెలుకుల సమస్యలన్నీ తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే అనకాపల్లి పార్లమెంటును అభివృద్ధి చేస్తానని, యువతకు ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రత్యేక కమ్యూనిటీ హాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం లెలుకుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. ఈనెల 30వ తేదీన గాండ్ల తెలుకుల భారీ బహిరంగ సభను అనకాపల్లిలో ఏర్పాటు చేస్తామని, ఆ కార్యక్రమానికి సీఎం రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. అనంతరం సీఎం రమేశ్‌కు నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వరరావు, సంఘ ప్రతినిధులు రాజపూడి కోటేశ్వరరావు, కరుణాకరనాయుడు, గండేపల్లి వెంకట్రావు, కొమ్మనాపల్లి వాసుదేవరావు, సభ్యులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన పోలీస్ భద్రత పరిశీలకులు



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన పోలీస్ ఎన్నికల భద్రత అబ్జర్వర్

ఎలమంచిలి, ఏప్రిల్ 26: స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను శుక్రవారం జిల్లా పోలీస్ ఎన్నికల భద్రత అబ్జర్వర్ మోహన్ ఎం దహికర్ పరిశీలించారు. పార్లమెంట్, అసెంబ్లీ ఈవీఎంలు భద్రపరిచి ఉన్న గదిని పరిశీలించారు. ఆయన వెంట స్థానిక తహసీల్దారు అప్పలరాజు, సీఐ గఫూర్, ఎస్‌ఐలు ఉన్నారు.

పాలిసెట్ అభ్యర్థులకు హాల్ టికెట్లు పంపిణీ

ఎస్. రాయవరం, ఏప్రిల్ 26: మండలంలోని పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పీఆర్‌టీయూ మండల నాయకులు పాలిసెట్ కోచింగ్ తీసుకున్న అభ్యర్థులకు హాల్ టికెట్లను శుక్రవారం అందజేశారు. అనంతరం శిక్షణ ఇచ్చిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, నాయకులు పెద్ది నాయుడు, విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలను పాటించడం తప్పనిసరి

పరవాడ, ఏప్రిల్ 26 : పరిశ్రమల యాజమాన్యాలు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి చిన్నారావు అన్నారు. విశాఖ ఫార్మాసిటీ కమర్షియల్ హబ్‌లో శుక్రవారం ఫార్మా పరిశ్రమల మేనేజర్లు, హెచ్‌ఆర్, సేఫ్టీ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమలశాఖకు సమర్పించాల్సిన రిటన్స్ గురించి వివరించారు. అలాగే పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులకు ఉన్న సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో 157 ఫార్మా పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి విజయం ఖాయం

▸ టీడీపీ నాయకుడు బాపునాయుడు

అచ్యుతాపురం, ఏప్రిల్ 26: ఎలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ విజయం ఖాయమని టీడీపీ నాయకుడు మేరుగు బాపునాయుడు అన్నారు. శుక్రవారం ఆయన పూడిమడకలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి గాజుగ్లాసు, కమలం గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మత్స్యకారులకు తీరని అన్యాయం జరిగిందని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే మత్స్యకారులను అన్ని సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయన్నారు. కార్యక్రమంలో పొన్నమళ్ల కొండబాబు. మేరుగు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రి అభివృద్ధి ఊసేది?

... 5వ పేజీ తరువాయి

అన్ని విభాగాల్లో తాత్కాలిక భృతిపై సిబ్బందిని నియమించుకొని నెట్టుకొస్తున్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వం అరకొరగా నిధులు విడుదల చేస్తుండడంతో ఆస్పత్రి నిర్వహణ భారంగా మారింది.

అందుబాటులోకి రాని సిటీస్కాన్ సేవలు

అదానీ గ్రూప్ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా గత ఏడాది డిసెంబరులో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో ఆస్పత్రికి అధునాతన సిటీస్కాన్ యంత్రాన్ని సమకూర్చింది. ఇదే నెలలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి ఈ యంత్రాన్ని ప్రారంభించారు. అయితే సిటీస్కాన్ ల్యాబ్ నిర్వహణకు ఒక మేనేజరు పోస్టు, ఇద్దరు టెక్నీషియన్లు, ముగ్గురు సహాయకులను నియమించాల్సి ఉండగా ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఇప్పటి వరకు సిటీస్కాన్ సేవలు అందుబాటులోకి రాలేదు.

నత్తనడకన క్రిటికల్ కేర్ ల్యాబ్ భవన నిర్మాణ పనులు

ఎన్టీఆర్ వైద్యాలయంలో రూ.22 కోట్ల అంచనాలతో కేంద్ర ప్రభుత్వం క్రిటికల్ కేర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేసింది. ఇందులో నాలుగు ఐసీయూ విభాగాలు, 50 పడకలు ఏర్పాటు కానున్నాయి. ఆస్పత్రికి సమీపంలోనే ఈ భవన నిర్మాణ పనులను చేపడుతున్నారు. అయితే ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆస్పత్రి పరిస్థితిపై వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావును వివరణ కోరగా ఉన్నంతలో నిధులు వినియోగించుకుని రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. నిర్వహణ నిధుల పెంపు, సిటీస్కాన్ సిబ్బంది నియామకం, వైద్య నిపుణుల నియామకాల కోసం కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి లేఖ రాశామని ఆయన చెప్పారు.

దిమిలిలో వైసీపీకి గట్టి షాక్

▸ జనసేనలో చేరిన మండల వైస్ ఎంపీపీ దంపతులు



జనసేనలో చేరిన వైస్ ఎంపీపీ దంపతులు లక్ష్మి, వడ్డీకాసులు

రాంబిల్లి, ఏప్రిల్ 26 : మండలంలోని దిమిలిలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. మండల వైస్ ఎంపీపీ దంపతులు కోటాపు లక్ష్మి, ఆమె భర్త మాజీ సర్పంచ్ వడ్డీకాసులు తన అనుచరులతో కలిసి శుక్రవారం దిమిలిలో జనసేనలో చేరారు. ఎలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు రాజేష్ ఆ దంపతులకు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ మండల వైస్ ఎంపీపీ దంపతులు కోటాపు లక్ష్మి, వడ్డీకాసులు జనసేన పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ దంపతులు లక్ష్మి, వడ్డీకాసులు మాట్లాడుతూ ఎలమంచిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి విజయకుమార్, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సుందరపు సోదరుడు సుందరపు సతీష్‌కుమార్, టీడీపీ, జనసేన నాయకులు వి.దినబాబు, బైలపూడి శ్రీరామదాసు, పప్పల నూకన్నదొర, డీఎస్‌ఎన్‌రాజు, దల్లమ్మదేవి, సుందను సత్యనారాయణ, రాజాన విజయ్ పాల్గొన్నారు.

బొగ్గు లారీల కాలుష్యంపై చర్యలు చేపట్టాలి

పరవాడ, ఏప్రిల్ 26: పరవాడ మీదుగా హిందూజా పవర్‌ప్లాంట్‌కు వెళుతున్న బొగ్గు లారీల కాలుష్య నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఐద్వా జిల్లాఅధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. పరిమితికి మించి బొగ్గును రవాణా చేయడం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని, దీనివల్ల దుమ్ము, ధూళి ఎగసిపడి కాలుష్యం పెరిగిపోతుందన్నారు. రహదారులు గుండా ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. పరిమితికి మించి బొగ్గును రవాణా చేస్తున్న లారీలపై కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే బొగ్గు నుంచి వెదజల్లే కాలుష్య నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

మునిసిపాలిటీలో కూటమి నేతలు ప్రచారం

ఎలమంచిలి, ఏప్రిల్ 26: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మునిసిపాలిటీ 16వ వార్డు అగ్నిమాపక కాలనీలో కూటమి నాయకులు శుక్రవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, నాయకులు గుర్రాల శేఖర్, నక్కా శివ శంకర్ తదితర నేతలంతా కలిసి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను,ఆడారి రమణబాబు,కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా రాధాకృష్ణుల కల్యాణం



కాకివానివీధిలో రాధా కృష్ణుల కల్యాణం చేస్తున్న అర్చకులు

ఎలమంచిలి, ఏప్రిల్ 26: మునిసిపాలిటీలోని కాకివానివీధి శ్రీకృష్ణుని ఆలయంలో శుక్రవారం రాధాకృష్ణుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులంతా కలిసి పండితుల సమక్షంలో కల్యాణాన్ని సంప్రదాయ రీతిలో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ విగ్రహ పునఃప్రతిష్ఠ

సబ్బవరం, ఏప్రిల్ 26: స్థానిక రామాలయం సమీపంలో అభయాంజనేయ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానికులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారికి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

జూనియర్ లైన్‌మన్ కుటుంబాన్ని ఆదుకోవాలి

తుమ్మపాల, ఏప్రిల్ 26: మునగపాక మండలం చూచుకొండ జూనియర్ లైన్‌మన్ పీతల శివసూర్యనారాయణ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజాన దొరబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్‌ఈసీఎస్ సంస్థను ఈపీడీసీఎల్‌లో విలీనం చేసిన తరువాత ఆర్‌ఈసీఎస్ సిబ్బందిని బానిసలుగా చూస్తున్నారన్నారు. ఉద్యోగుల భద్రతపై పట్టించుకోవడం మానేశారన్నారు. ప్రతి ఉద్యోగికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

టీడీపీలో చేరిన 'పేట' వార్డు సభ్యుడు



టీడీపీలో చేరిన వార్డు సభ్యుడు దాసరి శ్రీనివాస్, తదితరులు

పాయకరావుపేట, ఏప్రిల్ 26 : పాయకరావుపేట పంచాయతీ 4వ వార్డు సభ్యుడు దాసరి వీరభద్ర శ్రీనివాసరావు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. శుక్రవారం పంచాయతీ వార్డు సభ్యుడు దాసరి వీరభద్ర శ్రీనివాసరావుతోపాటు పలువురు చేనేత కార్మికులు టీడీపీలో చేరగా.. వీరందరికీ టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, పంచాయతీ వార్డు సభ్యుడు మలిపెద్ది వెంకటరమణ, పెదిరెడ్డి నాగవెంకటరమణ(పండు) తదితరులు పాల్గొన్నారు.

బీసీ యాత సాధికార డిక్లరేషన్ విడుదల

కొత్తూరు, ఏప్రిల్ 26 : బీసీ యాత సాధికార డిక్లరేషన్‌ను అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఎంపీ అభ్యర్థి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, చోడవరం జనసేన ఇన్‌చార్జి పీవీఎస్‌ఎన్.రాజు, బీసీ యాత సాధికార రాష్ట్ర కన్వీనర్ ఒసుం శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టా మాణిక్యం, పార్లమెంట్ కమిటీ సభ్యుడు కడియాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాగిర్తమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 26 : మండలంలోని కుమారపురంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బాగిర్తమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ దాతలు యన్నంరెడ్డి దండమ్మ మనవళ్ళు శివారెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, భాస్కరరెడ్డి, దండరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు విశేష పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కాగా దానధర్మ చారిటబుల్ ట్రస్టు మైక్ సెట్‌ను ఆలయానికి విరాళంగా అందజేశారు.

జలకళ... నెరవేరని రైతుల కల..!

» బుచ్చెయ్యపేట మండలంలో 323 మంది రైతుల నుంచి పథకానికి దరఖాస్తులు » వివిధ కారణాలు చూపి 251 మందివి రిజక్టు
» పెండింగ్‌లో 21 మందివి » మిగిలిన 51 మందిలో చాలామందికి అందని కనెక్షల్లు » ఆర్భాటపు తంతుగా అన్నదాతలు ఆగ్రహం

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 26 : వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న జలకళ పథకం రైతులకు అందని ద్రాక్షలా మారింది. మెట్ట ప్రాంత సాగు భూములకు నీరుదించేందుకు ఉద్దేశించిన ఈ పథకం ఆర్భాటపు తంతుగా మిగిలింది.

గ్రామాల వారీగా అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పరిపాలనాపరమైన అనుమతులు జారీ చేశారు. కానీ లక్ష్యం మేరకు బోర్లు తవ్వలేదు. సరికదా.. కొన్నిచోట్ల తవ్విన బోర్లలో సగం వాటికి నేటికీ విద్యుత్ సరఫరా ఇవ్వలేదు. దీంతో పాలకుల తీరును సాగు రైతులు ఎండగడుతున్నారు.

మండలంలో 323 మంది రైతుల నుంచి ఈ పథకానికి దరఖాస్తులను స్వీకరించారు. వాటిలో వీఆర్వో, జియాలజిస్టు నిబంధనల సర్వే మేరకు రిజక్టు చేసినవి 251 దరఖాస్తులు. మిగిలి 72 దరఖాస్తుల్లో 21 మందివి పెండింగ్‌లో పెట్టారు. కేవలం 51 మంది రైతులకు మాత్రమే ఈ పథకాన్ని మంజూరు చేశారు. ఇందులో పది లబ్ధిదారులకు సంబంధించిన భూముల్లో బోర్లు డ్రిల్లింగ్ చేయలేదు. మిగిలి 41మంది భూముల్లో డ్రిల్లింగ్ చేసిన బోర్లలో 31చోట్ల నీరు పడగా, మిగిలిన పదిచోట్ల నీరు పడలేదు. ఈ 31మందిలో కేవలం ఏడుగురు రైతుల బోర్లకు మాత్రమే మోటార్లు అందించారు. ఆర్.భీమవరం మూడు, ఎల్.సింగవరంలో ఒకటి, దిబ్బిడిలో ఒకటి, లోపూడిలో రెండు చొప్పున మోటార్లు పంపిణీ చేశారు. మిగతా 24 మందికి విద్యుత్ మోటార్లు పంపిణీ చేయలేదు. ఇందులో పది మందికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదు. ఈ పథకంలో భాగంగా రెండున్నరేళ్ల క్రితం బోర్లు వేయగా, ఏడాది క్రితం విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. నెల రోజుల క్రితం ఏడుగురికి మాత్రమే మోటార్లు ఇచ్చారు. ఈ కారణంగా పంటలు కోల్పోతున్నామని మెట్ట రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆర్.భీమవరంలో జలకళ పథకంలో భాగంగా బోరు కోసం రిగ్గు కొడుతున్న దృశ్యం

విద్యుత్ కనెక్షన్ ఖర్చు భరించాలట



జలకళ పథకంలో భాగంగా రెండున్నరేళ్ల క్రితం బోరు వేశారు. మారిన నిబంధనల మేరకు విద్యుత్ కనెక్షన్ ఖర్చు లబ్ధిదారులే భరించాలని అంటున్నారు. పెట్టుబడి పెట్టే స్తోమత లేక విద్యుత్ కనెక్షన్ పెట్టుకోలేకపోయాను.

\- శనివాడ అప్పారావు, లబ్ధిదారుడు, బుచ్చెయ్యపేట

మెటారు ఇవ్వలేదు



జలకళ పథకం వర్తిస్తే సాగు భూములకు నీటి వసతి అందుబాటులోకి వస్తుందని సంబరపడ్డాను. మూడుళ్ల క్రిందట బోరు తవ్వించారు. ఇప్పటి వరకు మోటారు బిగించలేదు. దీనిపై పలుమార్లు అధికారులు, నాయకులు చట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకపోతోంది.

\- మేరుగు శ్రీను, లబ్ధిదారుడు, బంగారుమెట్ట

అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన

» నర్సీపట్నంలో 8 ఆమోదం.. రెండు తిరస్కరణ » చోడవరంలో 13 ఆమోదం.. రెండు తిరస్కరణ » మాడుగులలో 11 ఆమోదం.. రెండు తిరస్కరణ

నర్సీపట్నం, ఏప్రిల్ 26 : నర్సీపట్నంలో ఎనిమిది మంది ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ పత్రాలు ఆమోదించినట్టు రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం తెలిపారు. శుక్రవారం ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాల పరిశీలన జరిపారు. ప్రధాన పార్టీలు టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థులతో పాటు రిజిస్టర్ పార్టీలు జై భీం రావు భారత్, భారత చైతన్య యువజన పార్టీ, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు ఆమోదించినట్టు వెల్లడించారు. తెలుగుదేశం తరపున డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు చిన్నకుమారుడు రాజేశ్, వైసీపీ తరపున డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఎమ్మెల్యే గణేశ్ భార్య కళావతి నామినేషన్ పత్రాలను తిరస్కరించినట్టు ఆర్వో తెలిపారు. టీడీపీ, వైసీపీ ప్రధాన అభ్యర్థులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, పెట్ల ఉమాశంకర్ గణేశ్ నామినేషన్ పత్రాలు ఆమోదం పొందడంతో రాజేశ్, కళావతి నామినేషన్ పత్రాలు తిరస్కరించామన్నారు.

చోడవరం : నియోజకవర్గంలో శుక్రవారం నామినేషన్ల స్క్రూటినీ అనంతరం 13 నామినేషన్లు మిగిలాయి. ఎన్నికల అధికారి చేపట్టిన ఈ ప్రక్రియలో టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజుకు డమ్మీగా వేసిన గూనూరు మల్లునాయుడు నామినేషన్, విప్ ధర్మశ్రీకి డమ్మీగా ఆయన భార్య వెంకటక్ష్మి వేసిన నామినేషన్ తిరస్కరణకు గురయ్యాయి. చోడవరం అసెంబ్లీ స్థానానికి ఎనిమిది మంది అభ్యర్థులు 15 నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, డమ్మీగా గూనూరు మల్లునాయుడు ఒక నామినేషన్ వేశారు. వైసీపీ నుంచి ధర్మశ్రీ మూడుసెట్లు, ఆయనకు డమ్మీ అభ్యర్థిగా ధర్మశ్రీ భార్య వెంకటలక్ష్మి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ నుంచి జగతా శ్రీనివాసరావు రెండు సెట్ల నామినేషన్లు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నుంచి సవరాల గణేష్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేటకు చెందిన వేగి మహాలక్ష్మినాయుడు బీఎస్పీ అభ్యర్థిగా, ఇండిపెండెంట్‌గా నామినేషన్లు దాఖలు చేశారు. పేరిచర్ల వివేకరాజు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అయితే స్క్రూటినీలో రెండు నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, మిగిలిన ఆరుగురు అభ్యర్థులకు చెందిన 13 నామినేషన్లు మిగిలినట్టు రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణ వెల్లడించారు.

మాడుగుల : నియోజకవర్గ స్థానానికి దాఖలైన నామినేషన్లలో మూడు పత్రాలు తిరస్కరణకు గురయ్యాయి. ఈనెల 18నుంచి 25వ తేదీ వరకు 14 మంది అభ్యర్థులు 29 నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం ఆర్వో కార్యాలయంలో స్క్రూటినీ చేయగా ముగ్గురు అభ్యర్థులను, ఆరు నామినేషన్లను తిరస్కరించామని ఆర్వో సత్యవాణి తెలిపారు. టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తికి డమ్మీగా వేసిన బండారు మధులత నామినేషన్ పత్రం, వైసీపీ అభ్యర్థి ఈర్లె అనురాధకు డమ్మీగా వేసిన డిప్యూటీ సీఎం బూడి సతీమణి రమణమ్మకు సంబంధించిన మూడు పత్రాలు, బీఫాం లేకుండా టీడీపీ నుంచి పైలా ప్రసాదరావు వేసిన నామినేషన్‌తో పాటు ప్రసాదరావుకు డమ్మీగా వేసిన పైలా ఈవీఎస్ నాయుడు నామినేషన్ తిస్కరించినట్టు చెప్పారు. దీంతో 11 మంది అభ్యర్థులకు సంబంధించి 23నామినేషన్లు మిగిలాయాన్నారు.

సమస్యలపై రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు వినతి

కొత్తూరు, ఏప్రిల్ 26 : అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను రాష్ట్ర రేషన్ డీలర్స్ సంఘం ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా బీజేపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీలర్స్ సంఘం అధ్యక్షుడు దివి లీలా మాధవరావు మాట్లాడుతూ అల్పాదాయ కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న తమ కుటుంబాలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోమార్లు డీలర్ల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. మృతి చెందిన డీలర్ల అంత్యక్రియలకు సంక్షేమ నిధి ఏర్పాటు, హెల్త్ కార్డులు జారీ, బీమా సౌకర్యం కల్పించాలని విన్నవించారు. దీనిపై బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ స్పందిస్తూ- ప్రధాన నరేంద్రమోదీ, చంద్రబాబునాయుడుల దృష్టికి రేషన్ డీలర్ల సమస్యలను తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం రేషన్ డీలర్ల సమస్యలకు సంబంధించి వినతిపత్రం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి గంగాధర్, గౌడ్ రాష్ట్ర సమాఖ్య సలహాదారు ఫణికుమార్, డీలర్లు పాల్గొన్నారు.

కూటమి గెలుపుతోనే జిల్లా సర్వతోముఖాభివృద్ధి

» అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేష్




గొండుపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న సీఎం రమేష్

కె.కోటపాడు, ఏప్రిల్ 26 : నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు, జిల్లా అభివృద్ధికి, అలాగే మాడుగుల నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా అనకాపల్లి పార్లమెంట్ కూటమి అభ్యర్థి సీఎం రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని గుల్లేపల్లి, గొండుపాలెం, కె.కోటపాడు గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ ర్యాలీతో పాటు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తామని, మారుమూల గ్రామాల్లో ప్రజలకు అనువుగా ఉండేలా రోడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కూటమి మాడుగుల అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మోదీ.. రాష్ట్రంలో బాబు ఉంటే మేలు

కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి



కోమళ్లపూడిలో మాట్లాడుతున్న సీఎం రమేష్ భార్య శ్రీదేవి

బుచ్చెయ్యపేట/నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 26 : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం చారిత్రక అవసరమని కూటమి అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి అన్నారు. బుచ్చెయ్యపేట మండలం కొండపాలెం, కోమళ్లపూడిలలో శుక్రవారం ఆమె ఉపాధి కూలీలను కలుసుకుని మాట్లాడారు. జగన్ పాలనలో రైతులు, మహిళలు, యువకులు ఇలా అన్ని వర్గాలవారికి తీరని అన్యాయం జరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలో చంద్రబాబు, కేంద్రంలో మోదీ అధికారంలో ఉంటేనే అన్నివర్గాలకు మేలు జరుగుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలావుంటే, నర్సీపట్నం మండలం వేములపూడిలో అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప, అయ్యన్న సతీమణి పద్మావతి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుకల రమణమ్మ, మాజీ ఎంపీపీ బోళెం వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అఫిడవిట్‌లలో అసమగ్ర సమాచారం : పైలా

మాడుగుల, ఏప్రిల్ 26 : సార్వత్రిక ఎన్నికల్లో మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసిన ముగ్గురు అభ్యర్థుల అఫిడవిట్‌లలో సమగ్ర సమాచారం లోపించిందని ఇండిపెండెంట్ అభ్యర్థి పైలా ప్రసాదరావు ఆరోపించారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారిణి జీవీ సత్యవాణికి శుక్రవారం ఫిర్యాదు కాపీని అందజేశారు. అనంతరం అయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసిన అనూరాధతో పాటు డమ్మీగా వేసిన ఆమె తల్లి బూడి రమణమ్మలు ఆర్వోకు అందజేసి అఫిడవిట్‌లో శ్రీదత్త పుణ్యగిరి చిట్స్ కంపెనీ డైరెక్టర్లుగా వ్యవహరిస్తూ, దానికి సంబంధించిన ఆదాయ వనరుల వివరాలు పొందుపర్చలేదన్నారు. అలాగే ప్రస్తుత మాడుగుల టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రిగా పెన్షన్ నెలకు సుమారు 50 వేలు, ఏడాదికి ఆరు లక్షలు తీసుకుంటున్నారని, దానికి సంబంధించి ఐటీ రిటర్న్ దాఖలు చేయలేదని ఆరోపించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినా అఫిడవిట్‌లో మాజీ ఎమ్మెల్యేగా తీసుకుంటున్న పెన్షన్ వివరాలు పొందుపరచలేదని అభ్యంతరం తెలిపారు. ఈ విషయాన్ని ఆర్వో వద్ద ప్రస్తావించగా, అన్నీ పరిశీలించి, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

29న సీఎం చోడవరం రాక

చోడవరం, ఏప్రిల్ 26 : పట్టణంలో ఈనెల 29న సీఎం జగన్ పర్యటించనున్నారు. వాస్తవానికి ఈనెల 20న ఇక్కడ ముఖ్యమంత్రి సిద్ధం సభ జరగాల్సి ఉంది. అయితే ఇతరత్రా కారణాల వల్ల ఆ సభ రద్దయింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం జగన్ బహిరంగ సభ నిర్వహణకు వైసీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాల్సిందిగా విప్ ధర్మశ్రీ కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వ్యాను

» చినపాచిల ఎస్సీ కాలనీ వద్ద త్రుటిలో తప్పిన ప్రమాదం

రావికమతం, ఏప్రిల్ 26 : అదుపు తప్పిన ఓ వ్యాను విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో అది ధ్వంసమైంది. మండలంలోని చినపాచిల ఎస్సీ కాలనీ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. కవ్వగుంట నుంచి రావికమతం వస్తున్న టాటా ఏస్ వాహనం చినపాచిల ఎస్సీ కాలనీ మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో అది పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో వైర్లు కలిసిపోవడంతో పెద్ద శబ్దంతో నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. దీంతో సదరు వాహనం డ్రైవర్ చాకచక్యంగా దూకేయడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది.



విద్యుత్ స్తంభాన్ని వ్యాన్ ఢీకొన్న దృశ్యం

బస్ స్టేషన్‌లో కనీస సౌకర్యాలు కరువు

» మాకవరపాలెంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
» పట్టించుకోని అధికారులు » చీకటి పడితే ఆవరణ అంతా అంధకారం



కనీస సౌకర్యాలు కరువైన మాకవరపాలెం బస్ స్టేషన్

మాకవరపాలెం, ఏప్రిల్ 26 : ఇక్కడి బస్ స్టేషన్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం మాకవరపాలెంలో ఉన్న ఈ బస్ స్టేషన్ నుంచి ప్రతిరోజూ పదుల సంఖ్యలో ప్రయాణికులు నర్సీపట్నం, అనకాపల్లి, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తుంటారు. చాలా సందర్భాల్లో బస్సులు సకాలంలో ఈ స్టేషన్‌కు చేరవు. వాటికోసం నిరీక్షించే ప్రయాణికులకు ఇక్కడ తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మహిళల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. అసలే వేసవి కావడంతో తాగునీరు అందుబాటులో లేకపోవడంతో దుకాణాల్లో డబ్బులు చెల్లించి వాటర్ బాటిళ్లు, కూల్ డ్రింక్‌లు వంటివాటితో గొంతు తడుపుకుంటున్నారు. ఇక ఇక్కడ చీకటిపడితే అంధకారం అలముకుంటుంది. ఈ బస్ స్టేషన్‌లో రాత్రివేళ విద్యుత్ వెలుగులు లేకపోవడంతో ప్రయాణికులు మరిన్ని కష్టాలకు గురవుతున్నారు. ఇదిలావుంటే, ఇటీవల ఈ బస్‌స్టేషన్‌లో మట్టితో గోతులను కప్పారు. వాటికి నీటి తడుపులు లేకపోవడంతో బస్సుల రాకపోకల సమయాల్లో దుమ్ము, ధూళి ప్రయాణికులపై ఎగసి పడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించాల్సిందిగా ప్రయాణికులంతా కోరుతున్నారు.

అసంపూర్తి కుళాయి పనులతో అవస్థలు



పట్టణంలో అర్ధంతరంగా నిలిచిపోయిన పైప్‌లైన్ పనులు

మాడుగుల, ఏప్రిల్ 26 : మండల కేంద్ర మాడుగులలో ఇంటింటి కుళాయి కనెక్షన్ల ఏర్పాటు పనులు అసపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు నెలల క్రితం ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు వేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్ పనులను ప్రాంభించారు. అయితే పట్టణంలో కొన్ని ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చి, మరికొన్ని ఇళ్లకు లైన్లు వెయ్యకుండా వదిలేశారు. దీంతో పెండింగ్ పనులు ఎప్పుడు చేపడతారని పలువురు అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాల్సిందిగా కోరుతున్నారు.

కాగిత చెరువు వద్ద చెత్తాచెదారం తొలగింపు



చెరువు వద్ద చెత్తాచెదరాన్ని తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 26 : మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్ సమీపాన కాగిత చెరువు వద్ద ఎట్టకేలకు చెత్తాచెదారాన్ని తొలగించి, పరిసరాలను తీర్చిదిద్దారు. చెరువుల వద్ద చెత్త పారేయడం, వ్యర్థాలు పేరుకుపోవడంతో పాడి రైతులు, పశుపక్ష్యాదులకు సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో ఈ నెల 25న 'చెరువుల్లో చెత్త పారబోతతో చిక్కులు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. ఈ మేరకు అధికారులు వెంటనే స్పందించి కాగిత చెరువు వద్ద స్వీపర్లతో చెత్తా చెదారాన్ని తొలగించే ఏర్పాట్లు చేపట్టారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తూనే, చెరువులు, నదులు వంటి నీటి వనరులున్న ప్రదేశాలలోల ఇలా చెత్త పారబోయకుండా ప్రజలను చైతన్యపర్చాల్సిందిగా కోరుతున్నారు.

పెద్దాస్పత్రి అభివృద్ధి ఊసేది?



వినియోగంలో లేని మరుగుదొడ్లు

... 5వ పేజీ తరువాయి

అన్ని విభాగాల్లో తాత్కాలిక భృతిపై సిబ్బందిని నియమించుకొని నెట్టుకొస్తున్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వం అరకొరగా నిధులు విడుదల చేస్తుండడంతో ఆస్పత్రి నిర్వహణ భారంగా మారింది.

అందుబాటులోకి రాని సిటీస్కాన్ సేవలు

అదానీ గ్రూప్ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా గత ఏడాది డిసెంబరులో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో ఆస్పత్రికి అధునాతన సిటీస్కాన్ యంత్రాన్ని సమకూర్చింది. ఇదే నెలలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి ఈ యంత్రాన్ని ప్రారంభించారు. అయితే సిటీస్కాన్ ల్యాబ్ నిర్వహణకు ఒక మేనేజరు పోస్టు, ఇద్దరు టెక్నీషియన్లు, ముగ్గురు సహాయకులను నియమించాల్సి ఉండగా ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఇప్పటి వరకు సిటీస్కాన్ సేవలు అందుబాటులోకి రాలేదు.

నత్తనడకన క్రిటికల్ కేర్ ల్యాబ్ భవన నిర్మాణ పనులు

ఎన్టీఆర్ వైద్యాలయంలో రూ22 కోట్ల అంచనాలతో కేంద్ర ప్రభుత్వం క్రిటికల్ కేర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేసింది. ఇందులో నాలుగు ఐసీయూ విభాగాలు, 50 పడకలు ఏర్పాటు కానున్నాయి. ఆస్పత్రికి సమీపంలోనే ఈ భవన నిర్మాణ పనులను చేపడుతున్నారు. అయితే ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆస్పత్రి పరిస్థితిపై వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావును వివరణ కోరగా ఉన్నంతలో నిధులు వినియోగించుకుని రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. నిర్వహణ నిధుల పెంపు, సిటీస్కాన్ సిబ్బంది నియామకం, వైద్య నిపుణుల నియామకాల కోసం కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి లేఖ రాశామని ఆయన చెప్పారు.

గ్రామాల్లో రాజీనామా చేయని 38 మంది గ్రామ వలంటీర్లు

మాకవరపాలెం, ఏప్రిల్ 26 : అధికార పార్టీ ఆదేశాల మేరకు మండలంలో కొంత మంది వలంటీర్లు రాజీనామాలు చేసినా.., కొన్ని గ్రామాల్లో ఇంకా కొంత మంది రాజీనామాలు చేయలేదు. మండల వ్యాప్తంగా 284 మంది వలంటీర్లు ఉండగా, వారిలో ఇప్పటి వరకూ 246 మంది రాజీనామాలు చేశారు. మిగిలిన 38 నేటికీ రాజీనామా చేయలేదు. వజ్రగడలో 17మంది, తూటిపాల ఒకరు, పీపీఅగ్రహారంలో ఏడుగురు, రాచపల్లిలో ఒకరు, గిడుతూరులో తొమ్మిది మంది వలంటీర్లు రాజీనామాలు చేయలేదు.

కార్యసిద్ధి ఆంజనేయ విగ్రహం ప్రతిష్ఠ



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

దేవరాపల్లి, ఏప్రిల్ 26 : రైవాడ గ్రామ శివారు బేతపూడి కాలనీలో నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దివంగత దుక్కా వెంకటరావు జ్ఞాపకార్థం నిర్మించిన ఈ ఆలయంలో విగ్రహాన్ని ఎల్.కోట మండలం గంగుబూడికి చెందిన దుక్కా వెంకటరమణ సమకూర్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు హోమాలు జరిపారు. ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు భార్య రమణమ్మ, సింహాచలంనాయుడు, గండిపడాల అప్పలరాజు, లక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి ఘటనలో ఆరుగురిపై కేసు

నర్సీపట్నం, ఏప్రిల్ 26 : మునిసిపాలిటీ పరిధి పెద బొడ్డేపల్లి కాపువీధికి చెందిన రెడ్డి సత్యవతిపై పలువురు దాడి చేశారని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. ప్రహరీ గోడ నిర్మాణం చేసుకుంటుండగా స్థల వివాదం లేవనెత్తి కాళ్ళ సత్యనారాయణ, కృష్ణమ్మ, వరహాలనాయుడు, చింతల్లి, పార్వతి, లక్ష్మి తనపై దాడి చేసి కొట్టారని రెడ్డి సత్యవతి ఫిర్యాదు చేసిందని ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం

నర్సీపట్నం, ఏప్రిల్ 26 : పట్టణంలోని సీబీఎం కాంపౌండ్ సమీపంలో శుక్రవారం రోలుగుంట మండల కొండకులం గ్రామానికి చెందిన కర్రి శ్రీనివాసరావు వద్ద ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

'నిబంధనలను పాటించడం తప్పనిసరి'

పరవాడ, ఏప్రిల్ 26 : పరిశ్రమల యాజమాన్యాలు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి చిన్నారావు అన్నారు. విశాఖ ఫార్మాసిటీ కమర్షియల్ హబ్‌లో శుక్రవారం ఫార్మా పరిశ్రమల మేనేజర్లు, హెచ్‌ఆర్, సేఫ్టీ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమలశాఖకు సమర్పించాల్సిన రిటన్స్ గురించి వివరించారు. అలాగే పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులకు ఉన్న సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో 157 ఫార్మా పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

దిమిలిలో వైసీపీకి గట్టి షాక్

» జనసేనలో చేరిన మండల వైస్ ఎంపీపీ దంపతులు

రాంబిల్లి, ఏప్రిల్ 26 : మండలంలోని దిమిలిలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. మండల వైస్ ఎంపీపీ దంపతులు కోటాపు లక్ష్మి, ఆమె భర్త మాజీ సర్పంచ్ వడ్డీకాసులు తన అనుచరులతో కలిసి శుక్రవారం దిమిలిలో జనసేనలో చేరారు. ఎలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు రాజేశ్ ఆ దంపతులకు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ మండల వైస్ ఎంపీపీ దంపతులు కోటాపు లక్ష్మి, వడ్డీకాసులు జనసేన పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ దంపతులు లక్ష్మి, వడ్డీకాసులు మాట్లాడుతూ ఎలమంచిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి విజయకుమార్, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ విజయానికి శక్తివంచెన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సుందరపు సోదరుడు సుందరపు సతీష్‌కుమార్, టీడీపీ, జనసేన నాయకులు వి.దిన్‌బాబు, బైలపుడి శ్రీరామదాసు, పప్పల నూకన్నదొర, డీఎస్ఎన్‌రాజు, దల్లమ్మదేవి, సుందను సత్యనారాయణ, రాజాన విజయ్ పాల్గొన్నారు.